ఘాటీ ప్రయాణంలో చార్జీల వడ్డన

- జీవో నెం.35ను జారీ చేసిన ఏపీ ప్రభుత్వం
- భద్రాచలం-రాజమండ్రి వయా చింతూరు
- మారేడుమిల్లి, తులసిపాక వద్ద ఈఎంసీ తనిఖీ కేంద్రాల ఏర్పాటు
- పర్యాటకుల రక్షణ చర్యలపై సైతం దృష్టి

వివరాలు : 7లో

ప్రాణం తీసిన వేధింపులు

- ప్రముఖ వ్యాపారి చేకూరి సత్యంబాబు బలవన్మరణం
- చిన్నకుమారుడితో కొంతకాలంగా ఆస్తి వివాదాలు
- అప్పులు తీర్చాలని మూడు రోజుల క్రితం తన ఇంటివద్ద కొందరు వ్యక్తుల బైఠాయింపు
- పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించిన పోలీసులు
- వరుస ఘటనలతో మనస్తాపం చెందిన సత్యంబాబు
- తెల్లవారుజామున ఇంట్లోనే విషం తాగి ఆత్మహత్య
- తనను బజారు కీడుస్తున్నారని సూసైడ్ నోట్‌లో వెల్లడి
- తన శవం వద్దకు చిన్న కొడుకు, కోడలిని రానివ్వొద్దని విన్నపం
- ఖమ్మం వ్యాపార వర్గాల్లో విషాదం



సత్యంబాబు



ఖమ్మం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చేకూరి సత్యంబాబు(79).. కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడటం వ్యాపార వర్గాల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. తాను ఆత్మహత్య చేసుకోవడానికి తన చిన్న కుమారుడితోపాటు మరికొందరు కారణమంటూ సూసైడ్ నోట్ రాయడం కలకలం రేపుతోంది. 'నా శవం దగ్గరకు చిన్న కొడుకు, కోడలిని రానివ్వొద్దు..' అని సత్యంబాబు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అయితే పోలీసులు వ్యవహరించిన తీరు వల్లే సత్యంబాబు బలవన్మరణానికి పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయి.

ఖమ్మం నగరంలోని వీడీవోల కాలనీలో నివాసం ఉంటున్న సత్యంబాబు సోమవారం తెల్లవారుజామున తన నివాసంలో గుర్తు తెలియని పాయిజన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన ఎన్నో యేళ్ల నుంచి కోల్డ్ స్టోరేజీలు, జిన్నింగ్ మిల్లు, చిట్‌ఫండ్స్ వంటి పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య నాగేంద్రమ్మ, ఇద్దరు కుమారులు శ్రీధర్, శేఖర్‌లు ఉన్నారు. కొద్దికాలం నుంచి చిన్న కుమారుడు శేఖర్‌తో ఆస్తికి సంబంధించిన వివాదం కొనసాగుతోంది. ఇందుకు సంబంధించి పలుమార్లు పెద్ద మనుషుల్లో (మిగతా 6వ పేజీలో)



ఆయిల్‌పామ్‌తోటలో మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల

వచ్చే ఖరీఫ్ నాటికి సీతారామ జలాలు

సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా వచ్చే ఖరీఫ్‌నాటికి రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని మంత్రి తుమ్మల ప్రకటించారు. ఏన్కూరు లింక్‌కెనాల్‌తో పాటు యాతాలకుంట ట్రంక్ పనులు పూర్తిచేయించి గోదావరి జలాలను లంకాసాగర్‌కు అనుసంధానం చేయబోతున్నామని, తద్వారా సాగర్ నీటితో సంబంధం లేకుండా ముందుగానే గోదావరి జలాలతో పంటలు పండించుకోవచ్చని తెలిపారు. సాగునీటి సౌకర్యం లేని రఘునాథపాలెం మండలానికి ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులన్నింటికి నీరు అందించి సస్యశ్యామలం చేయబోతున్నామని ఈ మండలాన్ని ఆయిల్‌పామ్ సాగుకు మోడల్ మండలంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు.

వైద్య కళాశాలను సమున్నతంగా

తీర్చిదిద్దుతాం

- 40 ఎకరాల్లో రూ.166 కోట్లతో భవన సముదాయం
- ఈ నెల 7న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి చేతులమీదుగా శంకుస్థాపన
- భవిష్యత్‌లో పీజీ కళాశాలగా ఉన్నతీకరిస్తాం
- వచ్చే జూన్ నాటికి సీతారామ ద్వారా రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు
- ఆయిల్‌పామ్ టన్ను ధర రూ.20413కు చేరింది..
- రైతులందరూ ఈ సిరుల పంటను సాగు చేయాలి
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల రాష్ట్రానికే ఆదర్శంగా నిలువబోతోందని, కాకతీయ, ఉస్మానియా, గాంధీ మెడికల్ కళాశాలల వలే అభివృద్ధి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి సీతారామ ద్వారా రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, ఎత్తిపోతల పథకాల ద్వారా రఘునాథపాలెం మండలాన్ని సస్యశ్యామలం చేయబోతున్నామని పేర్కొన్నారు. ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం గణనీయంగా ప్రోత్సహిస్తున్నదని, తాజాగా టన్ను ధర రికార్డుస్థాయిలో రూ.20,413కి చేరిందని పేర్కొన్నారు. ఖమ్మం సమీపంలోని రఘునాథపాలెం మండలం బాలపేటలో మెడికల్ కళాశాల భవన సముదాయం నిర్మాణ స్థలాన్ని మంత్రి తుమ్మల సోమవారం సందర్శించారు. 40 ఎకరాల్లో రూ.166 కోట్లతో నిర్మించనున్న భవనాలకు ఈ నెల 7న రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో మంత్రితోపాటు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం రైతు మానుకొండ రాధాకిషోర్ ఆయిల్‌పామ్ వ్యవసాయక్షేత్రంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడారు. రెండేళ్ల క్రితం ఖమ్మంకు మంజూరైన మెడికల్ కళాశాలను ఖాళీగా ఉన్న పాత కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కళాశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి 40 ఎకరాల స్థలాన్ని కేటాయించి రూ.166 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ప్రస్తుతం కళాశాల 100 సీట్లకే పరిమితమైందని, వాటిని 150కి (మిగతా 6వ పేజీలో)

ఆయిల్‌పామ్ సిరులు కురిపిస్తోంది...

ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ కృషిమేరకే దేశంలో ఆయిల్‌పామ్ టన్ను ధర రూ.20413కు చేరిందని, ఇది రైతులకు గిట్టుబాటు ధర అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఏడాది క్రితం కేవలం రూ.13,075 ఉన్న టన్ను ధర కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి చేసిన విజ్ఞప్తి మేరకు దిగుమతి సుంకం పెంచడంతో ఇటీవల రూ.19144కు చేరుకుని రూ.20413కు పెరిగిందని, ఆయిల్ పామ్ ధర మరింత పెరిగే అవకాశం ఉందని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఏడాదికి లక్ష ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను పెంచబోతున్నామని, ఎకరానికి రూ.52వేలు ప్రభుత్వం నుంచి సహాయం అందిస్తున్నామని, జిల్లాలోని రైతులు పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగుకు ముందుకు రావాలని ఈ పంట ఐఏఎస్, ఐపీఎస్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీతాలకంటే ఎక్కువ ఆదాయం తెచ్చి పెడుతుందని తెలిపారు.



పామాయిల్ రైతులకు

ఖుషీ కబర్

- రూ.20,413కు చేరిన గెలల ధర
- గత నెలకంటే టన్నుకి రూ.1269 పెరుగుదల

అశ్వారావుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పామాయిల్ గెలల ధర రోజురోజుకూ దూసుకుపోతోంది. గత జూలై వరకు పడిపోతూ వచ్చిన ధర ఆ తరువాత ప్రతీ నెల పెరుగుతూ వస్తుండటంతో రైతుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది. అక్టోబరులో టన్ను ధర రూ.19,144 ఉండగా, నవంబరులో రూ.1269 పెరిగి టన్ను ధర రూ.20,043కు చేరింది. గత జూలై వరకు రూ.12వేల వరకు మాత్రమే ఉన్న పామాయిల్ గెలల ధర, గడిచిన ఆరునెలల్లో ఏకంగా రూ.8 వేలకుపైగా పెరిగింది. పామాయిల్‌పైన దిగుమతి సుంకం 27.5 శాతానికి పెంచడం, గత నెలలో దేశంలోనే అత్యధికస్థాయిలో ఓఈఆర్ 19.42 శాతానికి పెరగటంతో పామాయిల్ ధరల్లో పెరుగుదల చోటు చేసుకుంది.

గెలల ధర పెంపుతో 7వేల మంది పామాయిల్ రైతులకు ప్రయోజనం కలగనుంది. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పామాయిల్ ధరల పెంపు, రాష్ట్ర వ్యాప్తంగా వేగంగా విస్తరించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆయన పామాయిల్ విస్తరణపై ప్రత్యేక దృష్టిపెట్టి దిగుమతి సుంకం పెంపుకోసం అనేకమార్లు కేంద్ర మంత్రితో, అధికారులతో సంప్రదింపులు జరిపారు. ఓఈఆర్ పెరుగుదలకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఇవన్నీ సత్ఫలితాలు ఇవ్వడంతో పామాయిల్ ధర నెల నెల పెరుగుతూ వస్తోంది.

ట్రాన్స్‌జెండర్ల క్లినిక్ ప్రారంభం



ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేక క్లినిక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రత్యేక విభాగంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌జెండర్ క్లినిక్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు కొంత ఇబ్బందులు పడాల్సి వచ్చిందని, వారి కోసం ప్రభుత్వం ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఇలాంటి క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఇక్కడ అన్ని విభాగాల వైద్యులు ప్రతి గురువారం అందుబాటులో ఉంటారని ఈ క్లినిక్‌ను సద్వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్.కిరణ్‌కుమార్, వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ బి.కిరణ్‌కుమార్, డాక్టర్ వినాయక్‌రాథోడ్, డాక్టర్ సౌమ్య, మెడికల్ కళాశాల సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యా కమిషన్ చైర్మన్ మురళి

మెను ప్రకారం ఆహారం

అందిస్తున్నారా?

- ఫుడ్ పాయిజన్ జరగకుండా చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి 6
- పలు పాఠశాలలో 'మధ్యాహ్న భోజనం' అమలుతీరు పరిశీలన
- రఘునాథపాలెం మైనారిటీ స్కూల్‌లో విద్యార్థినులతో కలిసి భోజనం

ఇచ్చిన హామీలను

అమలు చేస్తాం

- వరి వేస్తే ఉరే అన్న ప్రభుత్వాన్ని సాగనంపాం
- ఇప్పటివరకు రూ.21వేల కోట్ల రుణాలు మాఫీ చేశాం
- పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకం షురూ
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



గువ్వలగూడెంలో జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నేలకొండపల్లి/టేకులపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరి వేస్తే ఉరే అన్న ప్రభుత్వాన్ని సాగనంపి, ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నామని పాలేరు శాసనసభ్యుడు, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండలంలో సోమవారం సాయంత్రం పర్యటించిన పొంగులేటి గువ్వలగూడెంలో జరిగిన సభలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేస్తోందని, ఇప్పటివరకు రూ.21వేల కోట్ల రుణమాఫీ చేశామని తెలిపారు. కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వమన్నారు. రైతును రాజును చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రూ.250లు వరికి బోనస్ ఇచ్చిందని, ప్రస్తుతం ఇందిరమ్మ రాజ్యంలో రూ.500బోనస్ ఇస్తున్నామన్నారు. సంక్రాంతి తర్వాత రైతుభరోసా ఇస్తామన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని, ప్రతి నియోజకవర్గంలో 3500 ఇళ్లు ఇస్తామన్నారు. రానున్న నాలుగు సంవత్సరాల్లో తెలంగాణాలో ఇల్లు లేని వాళ్లుండరని పొంగులేటి అన్నారు. ఈనెల 5న ఇందిరమ్మ ఇళ్ల యాప్ ఓపెన్ అవుతుందన్నారు. పదేళ్లు పాలించిన గత ప్రభుత్వం అన్ని విషయాల్లో ప్రజలను మభ్యపెట్టిందన్నారు. కాగా, మంత్రి గువ్వలగూడెం, కొత్త కొత్తూరు, మంగళితండా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రానున్న పదిరోజుల్లో (మిగతా 6వ పేజీలో)

'సోలార్'.. బేఖార్..

- ఇన్‌చార్జిల పాలనలో ఇంధన వనరుల అభివృద్ధి శాఖ
- పక్క జిల్లాల అధికారుల రాకపోకలు
- పూర్తి స్థాయి నియామకాలతోనే పథకాల అమలు
- పురోగతిలో పీఎం సూర్య, గిరివికాస్, డ్వాక్రా సంఘాలకు సోలార్ ప్లాంట్లు
- ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో ఇళ్లకు సౌర విద్యుత్ కార్యాచరణ
- 'సోలార్ ఎనర్జీ' బలోపేతమైతేనే ప్రణాళికలు ఫలవంతం



ఖమ్మం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు థర్మల్ విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్‌ను అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందిస్తూ కార్యాచరణలోకి దిగుతుంటే జిల్లాస్థాయిలో ఆ శాఖలో పాలన ఇన్‌చార్జీలతోనే సాగుతోంది. పూర్తిస్థాయి అధికారులు, సిబ్బంది లేకపోవడంతో మొక్కుబడిగానే ఉంది. జిల్లాస్థాయిలో జిల్లా మేనేజర్‌తోపాటు ఇతర సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి. ప్రతిసారి ఇతర శాఖలనుంచి కొందరు అధికారులు ఇన్‌చార్జీలుగా వచ్చి పోతున్నారు. ప్రస్తుతం వరంగల్ జిల్లా అధికారి ఖమ్మం జిల్లాకు డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు. పూర్తిస్థాయిలో జిల్లాస్థాయి అధికారితో పాటు ఇతర సిబ్బందిని నియమిస్తేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సోలార్ విద్యుత్ పథకాల అమలుకు అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్రం సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచేందుకు (మిగతా 6వ పేజీలో)

సరిహద్దుల్లో హైఅలర్ట్

- పీఎల్‌జీఏ వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల కూంబింగ్
- అంతర్‌రాష్ట్ర సరిహద్దుల్లో రెప్పవాల్చని నిఘా

కొత్తగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టుల పీఎల్‌జీఏ వారోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గడ్, ఒడిసా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి మావోయిస్టు దళాలు జిల్లా సరిహద్దులోకి రాకుండా కట్టడి చేసేందుకు ముందుజాగ్రత్తలో భాగంగా పోలీసులు పెద్దఎత్తున మోహరించారు. ములుగు జిల్లా సరిహద్దు ప్రాంతమైన పినపాక నియోజకవర్గంలోని పినపాక, కరకగూడెం, ఏడూళ్లబయ్యారం, గుండాల, ఆళ్లపల్లి, ఇల్లెందు అడవుల్లో పోలీసులు పెద్దఎత్తున మోహరించి కూంబింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఛత్తీస్‌గడ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం, గోదావరినదీ పరివాహక ప్రాంతాల్లో సైతం పోలీసులను ముమ్మరం చేశారు.

ఆయా రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. పోలీసు నిఘా పెట్టారు. రాకపోకలు కొనసాగించే వారిని, అనుమానితులను సైతం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోని అడవుల్లో పెద్దఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన బలగాలను ముమ్మరం చేశారు. పీఎల్‌జీఏ (మావోయిస్టు ప్రజావిముక్తి గెరిల్లా సైన్యం) వారోత్సవాల్లో భాగంగా ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలో బీజాపూర్ జిల్లాలో జియో మొబైల్ సెల్ టవర్‌ను మావోయిస్టులు పేల్చివేశారు. దీంతో ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. సరిహద్దు ప్రాంతాలతో పాటు వంతెనలు, కాల్వలు, రోడ్డు భాగంలో ఉన్న వాటిని బాంబ్‌స్క్వాడ్‌తో కలిసి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు.

పాస్‌పోర్ట్ పొందడం ఎలా..?



» ఆన్‌లైన్‌లో సులువైన మార్గం
» సాధారణ పాస్‌పోర్ట్ నెలరోజులు, తత్కాల్ వారంలోపే...

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మీ అబ్బాయికి ఉద్యోగం వచ్చి అమెరికా, ఇతర దేశానికి వెళ్లాలన్నా...మీ అమ్మాయి పెళ్లిచేసుకుని ఎంచక్కా లండన్ వెళ్లాలన్నా పాస్‌పోర్ట్ తప్పనిసరి. ఇతర దేశాల్లో ఉన్న మీ పిల్లలను చూడడానికి వెళ్లాలంటే పాస్‌పోర్ట్ కావాలి. గతం లో పాస్‌పోర్ట్ పొందాలంటే హైదరాబాద్, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. కేంద్ర ప్ర భుత్వం తాజాగా గ్రామీణ ప్రాంతాలకు పాస్‌పో ర్ట్ సేవా కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో తపాలాశాఖ ద్వారా పాస్‌పోర్ట్ లను అందజేస్తోంది. అయితే మనం పాస్‌పోర్టు పొందడం ఎలా..? దీనికి దరఖాస్తు ఎలా చేయాలనే అంశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనమిది.

దేశవ్యాప్తంగా 37పాస్‌పోర్ట్ కార్యాలయాలున్నాయి. ఆరేళ్లక్రితం 250 పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలను మంజూరు చేసింది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం ఇప్పటివరకు మనకు తెలుసు. విదేశాల్లో చదువుకోవాలన్నా, జీమ్యాట్ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నా పాస్‌పోర్ట్ తప్పనిసరి. అందుకే వీటిని పొందడానికి విద్యార్థులు అధిక సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు.

ఏ వర్గాల వారికి ఎలా..?

చదువుకున్న వారైతే పాస్‌పోర్ట్‌కు పదోతరగతి మెమో, ఆధార్‌కార్డు లేదా 14 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి చిరునామా కోసం దరఖాస్తులో ఉండాలి. ఏమాత్రం చదువుకోని వారు ఆధార్‌కార్డుతోపాటు పాన్‌కార్డును జతపరచాల్సి ఉంటుంది. పుట్టిన తేదీ వివరాలు ఉండాల్సి ఉంటుంది.

● ఏదైనా ప్రభుత్వ ఉద్యోగులు పాస్‌పోర్ట్ పొందాలంటే పదోతరగతి మార్కుల మెమోతో పాటు ఆధార్‌నెంబర్, ఎంప్లాయి గుర్తింపు నెంబర్, కార్డు, సంబంధిత శాఖ (పాస్‌పోర్ట్ కార్యాలయం అధికారిక వెబ్‌సైట్ నుంచి ఎనగ్జర్-హెచ్ ఫారాన్ని డౌన్‌లోడ్ చేసి డ్రాయింగ్ అధికారితో సంతకం చేయించాల్సి ఉంటుంది.) నుంచి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది.

పదోతరగతి లేని చిరుద్యోగులు సర్వీస్‌బుక్‌లో నమోదైన వివరాలను జిరాక్స్ ప్రతులను జతపరచాలి.

● ఖమ్మంలో స్టేషన్‌రోడ్డు పరిధిలోని శ్రీనివాస థియేటర్ ఎదురుగా ఉన్న ప్రధాన తపాలాకార్యాలయంలో 2018 ఫిబ్రవరి 27న పాస్‌పోర్ట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యాలయం ప్రతి సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉద యం 9:15నుంచి సాయంత్రం 4:30

తెలుసుకుందాం..!

వరకు పనిచేస్తుంది. ప్రతి రోజు 90స్లాట్ బుకింగ్‌కు అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం 70నుంచి 80వరకు వస్తున్నాయి. ఏమైనా ఫిర్యాదులు చేయాలంటే టోల్‌ఫ్రీ నెంబర్.. 1800-258-1800.

దరఖాస్తు చేసుకోవడం ఇలా...!

పాస్‌పోర్ట్ కావాలనుకునే వారు రెండు రకాలుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం ఒక విధానం. రెండోది ఈ దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకుని పెన్నుతో పూర్తి చేసి మళ్లీ దాన్ని అప్‌లోడ్ చేసి పంపించే విధానం.ఇంటర్‌నెట్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉన్న వాళ్లు ఇంటి నుంచి కూడా దరఖాస్తు నింపి ఆన్‌లైన్‌లో పంపించవచ్చు.

● దరఖాస్తు చేసుకునే వారు www.passportindia.gov.inలో లాగిన్ కావాలి. అందులో హోం పేజీలో యూజర్ రిజిస్ట్రేషన్ వద్ద క్లిక్‌చేసి అడిగిన సమాచారాన్ని నింపి సబ్మిట్ చేయాలి. (అంటే కొత్తగా యూజర్‌ఐడీని ఏర్పాటు చేసుకోవాలి) కొత్తగా వచ్చే యూజర్ ఐడీతో కొత్త, (రెన్యువల్) పాస్‌పోర్ట్‌ల్లో ఏది కావాలంటే ఆ దరఖాస్తును నింపాలి. సంబంధిత ధ్రువపత్రాలను స్కాన్‌చేసి అప్‌లోడ్ చేయాలి. లేదా ఈ ఫారంను డౌన్‌లోడ్ చేసి నింపి అప్‌లోడ్ చేయవచ్చు. దరఖాస్తు రిఫరెన్స్ నెంబర్ (ఏఆర్‌ఎన్)ను తీసుకోండి. అపాయింట్‌మెంట్‌ను ఖరారు చేసుకొని, ఆ పత్రాన్ని ప్రింట్ తీసుకుని దగ్గర పెట్టుకోవాలి. ఈ విధానం అంతా స్లాట్ బుకింగ్ అంటారు. (మొత్తం 9 పద్ధతుల్లో ఈ దరఖాస్తును నింపాల్సి ఉంటుంది.) ఈ స్లాట్ బుకింగ్ చేసిన దరఖాస్తులను సేవా కేంద్రాల్లో ప్రతిరోజు సాయంత్రం 6గంటలకు పరిశీలిస్తారు. అందులో మీరు ఎప్పుడు పాస్‌పోర్టు కార్యాలయానికి రావాలన్నది నిర్దేశించిన తేదీని తెలియపరుస్తారు. విధిగా మీరు ఇచ్చిన సెల్‌నెంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా ఏ రోజున మీరు సేవా కేంద్రానికి రావాల్సి వస్తుందో మెసేజ్ ద్వారా తెలుపుతారు. ఆరోజు విధిగా పాస్‌పోర్ట్ సేవా కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. ఆరోజు ఆన్‌లైన్‌లో ఫారం సమర్పించినప్పుడు తీసిన ప్రింట్‌తోపాటు ఒరిజినల్ ధ్రువపత్రాలు రశీదుతో సహ హాజరుకావాల్సి ఉంటుంది. ఖమ్మం పట్టణానికి చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో చదువుకుంటుంటే ఖమ్మంలోనే తీసుకోవాల్సిన నిబంధనేమీ లేదు. కళాశాల యాజమాన్యం ఇచ్చే అఫిడవిట్‌తో అక్కడే దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఎక్కడ ఉంటున్నారనేది దరఖాస్తులు విధిగా తెలపాల్సి ఉంటుంది.

సేవా కేంద్రం వద్ద చేయాల్సినవి

● ఒకటో కౌంటర్(ఏ) వద్ద ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.

● రెండో కౌంటర్ (బి)వద్ద ఏ-1-18 మీ డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేస్తారు. ఫొటోలు తీసి చేతి వేళ్ల ప్రింట్లను తీసుకుంటారు.

● మూడో కౌంటర్ (సి)లో ప్రభుత్వ అధికారులుమరోమారు మీ దరఖాస్తును పరిశీలిస్తారు. ఆ తర్వాత మీ దరఖాస్తును జిల్లా పోలీస్ అధికారి కార్యాలయానికి పరిశీలనకు పంపిస్తారు. మీ వ్యక్తిగత వివరాలను పోలీస్ అధికారులు విచారించి నివేదికను అందించిన తర్వాత మీకు పాస్‌పోర్ట్‌ను మంజూరుచేస్తారు. సాధారణ దరఖాస్తు అయితే మూడు వారాల్లో, తత్కాల్ వారం రోజుల్లోగా పాస్‌పోర్ట్ జారీ చేస్తారు.

ఫీజుల వివరాలు

● సాధారణ పాస్‌పోర్ట్ -(36 పేజీలు) : రూ.1,500
● సాధారణ పాస్‌పోర్ట్ - (60 పేజీలు) : రూ.2,000
● తత్కాల్ పద్ధతి ద్వారా- (36పేజీలు) : రూ. 3,500
● తత్కాల్ పద్ధతి ద్వారా- (60 పేజీలు) : రూ.4,000
● దరఖాస్తు పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఎస్ఎంఎస్ అలర్ట్‌కోసం రూ:30.
● దరఖాస్తుల సమర్పణలో సందేహాలుంటే 17 భాషల్లో 24 గంటలపాటు పనిచేసే టోల్‌ఫ్రీ నెంబర్ 1800-258-1800కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చు.

ఇవి తెలుసుకోండి..

● పాస్‌పోర్ట్‌ను కేవలం పదేళ్ల వ్యవధికి మాత్రమే ఇస్తారు. ఆ గడువు పూర్తయ్యాక మళ్లీ పదేళ్ల కాలనికి రెన్యువల్ చేస్తారు.

● 18ఏళ్లలోపు వారిని మైనర్లుగా గుర్తిస్తారు.వారికి ఐదేళ్ల గడువున్నవి మాత్రమే అందజేస్తారు.

● సాధారణ పాస్‌పోర్ట్ నీలంరంగు, డిప్లమాట్ (జడ్జీలు, రాజ్యాంగ పదవుల్లో ఉండే సీఎం,ఎంపీలకు) మెరున్ రంగులో, అధికారిక పనుల కోసం వెళ్లే వారికి పాస్‌పోర్ట్‌ను బూడిద రంగులో అందజేస్తారు.



బహుమతులు సాధించిన విద్యార్థులు

రెండు జిల్లాల స్థాయి టేబుల్ టెన్నిస్‌లో
తల్లాడ విద్యార్థుల విజయకేతనం

తల్లాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో తల్లాడ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అండర్-11 బాలుర విభాగంలో తల్లాడకు చెందిన కోటగిరి హతేష్ శ్రీరంగా ప్రథమ బహుమతి, అండర్-13,15,17 బాలుర విభాగాల్లో ఈలప్రోలు హరి తృతీయ బహుమతులు సాధించాడు. అండర్-19లో ఈలప్రోలు తరుణ్ తృతీయ బహుమతి, హోక్స్ విభాగంలో ఎం.జషీన్‌బాబు ద్వితీయ బహుమతిని, ఎన్.జెనిల్‌బాబు తృతీయ బహుమతిని సాధించారు. బాలికల డబుల్స్ విభాగంలో డి.ఉజ్వల, షేక్.జవేరియా ద్వితీయ బహుమతిని సాధించారు. బహుమతులు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి ఎస్.దామోదర్‌ప్రసాద్, కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ కోటగిరి శ్రావణి, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, ఏవో యాచమనేని శశాంక్ అభినందించారు.

ఐపీఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టాభి

ఖమ్మం లీగల్ డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నవంబరు 30, డిసెంబరు 1న వరంగల్‌లో హరిత కాకతీయ హోటల్లో జరిగిన ఐపీఎల్ తెలంగాణ రాష్ట్ర రెండవ మహాసభలో రాష్ట్ర కమిటీని రెండవ రోజు ఎన్నుకోవడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా బొమ్మగాని ప్రభాకర్, ఉపాధ్యక్షునిగా పెమ్మసాని పట్టాభి, కార్యదర్శులుగా షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు కార్యవర్గ సభ్యుడిగా పి.అమర్‌చంద్, కౌన్సిల్ సభ్యులుగా ఎం.నవీన్‌కుమార్, జి.వి.లక్ష్మీనారాయణ, షేక్.నసీన్, ఆర్. మహేష్‌లను ఎన్నుకోవడం జరిగింది. ఈ మహాసభలో అనేక తీర్మానాలు చేశారు. వాటిలో న్యాయవాదులకు ప్రభుత్వం ఇళ్లస్థలాలు ఇవ్వాలని, జూనియర్ న్యాయవాదులకు ప్రతీనెల ఉపకారవేతనం పదివేల రూపాయలను ప్రభుత్వం ఇవ్వాలని, న్యాయవాదులకు డెత్ బెనిఫిట్స్ పది లక్షలు ఇవ్వాలని మహాసభ తీర్మానించింది.

పామాయిల్ గెలల ధర పెరుగుదలతో
అన్నదాతల హర్షం

దమ్మపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో పామాయిల్ గెలల ధర రూ.20వేలకు పైగా రావటంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. నాచారం గ్రామంలో ఎల్లిన రాఘవరావు నివాసంలో సోమవారం జరిగిన రైతుల సమావేశంలో పామాయిల్ బోర్డు అడ్వైజరీకమిటీ సభ్యుడు, పామాయిల్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్ మాట్లాడుతూ మంత్రి తుమ్మల కృషితో పామాయిల్ గెలల ధర టన్ను రూ.20413కు చేరిందని దీంతో పామాయిల్ రైతులు సంతోషంగా వున్నారన్నారు. తుమ్మల పలుమార్లు కేంద్ర ప్రభుత్వం దృష్టికి ప్రభుత్వం ద్వారా పలు లేఖలు పంపినట్లు తెలిపారు. దీనిపై పరిశీలించిన కేంద్రప్రభుత్వం చమురు దిగుమతులపై 27.5 శాతం దిగుమతి సుంకం పెంచటంతో పామాయిల్ గెలల ధర పెరిగిందని, దీంతో పాటు ఆయిల్ ఫెడ్ అధికారుల కృషితో ఓఈఆర్ కూడా పెరిగిందన్నారు.రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, కొయ్యల అచ్యుతరావు, కేవి సత్యనారాయణ, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు, గూడపాటి వెంకట్రావు, ఎర్రగొర్ల రాధాకృష్ణ, చీకటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో భారతీయ విద్యార్థుల భద్రతపై
ప్రత్యేక దృష్టి పెట్టాలి

మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మంటౌన్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో భారతీయ విద్యార్థుల భద్రతపై కేంద్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని, అక్కడి దౌత్య కార్యాలయాలు సముచితమైన చర్యలు తీసుకోవాలని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఖమ్మంలోని రాపర్తినగర్‌కు చెందిన నూకారపు కోటేశ్వరరావు కుమారుడు సాయితేజ యుఎస్‌లోని చికాగోలో హత్యకు గురైన సంఘటనపై నామా తీవ్ర సంతాపం వ్యక్తం చేశా రు. సాయితేజ కుటుంబానికి తన సానుభూతి తెలిపారు. విదేశాల్లో చదువులకోసం వెళుతున్న విద్యార్థులు ప్రాణాలు కోల్పోవటం గత కొన్నేళ్లుగా పునరావృతం అవుతుంటడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా విధివిధానాలు రూపొందించాలన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేస్తాం

(5వ పేజీ తరువాయి)

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలో సోమవారం మంత్రి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని సింగ్యాతండాలో రూ1.94 కోట్లతో నిర్మించనున్న సింగ్యాతండా-గొల్లగూడెం బీటీ రహదారికి, కుంటళ్లలో రూ.2.40 కోట్ల కుంటళ్ల-దాసుతండా బీటీ రహదారికి, ఎర్రాయిగూడెంలో రూ.90లక్షల ఎర్రాయిగూడెం-చింతలకట్ట రహదారికి, వడ్డుగూడెంలో వడ్డుగూడెం నుంచి బర్లగూడెం మీదుగా జంగాలపల్లి వరకు రూ.3.22కోట్ల బీటీ రహదారికి, గంగారంలో రూ.1.43కోట్ల గంగారం-చర్లపల్లి బీటీ రహదారికి, రూ.1.30కోట్ల వ్యయంతో గంగారం-ఉల్వాచెలక బీటీ రహదారుల నిర్మాణం పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. అలాగే ముత్యాలంపాడులో రాళ్లవాగులపై రూ.4.20లక్షల వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న పది రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం చేపడుతామన్నారు. మొదటి విడతలో స్థలం ఉండి ఇంటి నిర్మానానికి ఆర్థిక స్తోమతలేనివారికి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి గంగారం ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం కల్పిస్తున్నారా? లేదా అడిగి తెలుసుకొన్నారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ తదితరులు మంత్రి వెంట ఉన్నారు. అనంతరం ఇటీవల నేలకొండపల్లిలో హత్యకు గురైన వృద్ధ దంపతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఈసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, పీఆర్ ఈఈ శ్రీనివాస్, ఐటీడీఏ ఈఈ తానాజీ, డీఈ రాజు, జిల్లా వైద్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి లెనినా, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

నీలాద్రి హుండీ ఆదాయం రూ.7.63లక్షలు

పెనుబల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన నీలాద్రీశ్వర ఆలయంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. గత మూడునెలల కాలంలో రూ.7,63,981 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకటి చిన్ననర్సింహారావుతోపాటు దేవాదాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి...

» కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
» ప్రజావాణిలో ప్రజలనుంచి దరఖాస్తుల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు తమ సమస్యల పరిష్కారం అందించిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి ఒక వేదికలగా ఉపయోగపడుతుందని గ్రీవెన్స్‌ను ప్రభుత్వం అత్యంత కీలకంగా పరిగణిస్తుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లో చేయూత పింఛన్‌లు, సదరం సర్టిఫికెట్ లకు సంబంధించిన దరఖాస్తు, ఫిర్యాదుల సహాయక కేంద్రాన్ని జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ తో కలిసి పరిశీలించి వచ్చిన దరఖాస్తులను రిజిస్టర్ లో ఎప్పటికప్పుడు నమోదు చేసి పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, పర్యవేక్షకులు కారుమంచి శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఎస్ మాదవి, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అందిన పిర్యాదుల్లో కొన్ని...

● బోనకల్ మండల కేంద్రంలో ఉన్న మూడు మద్యం దుకాణాలలో మద్యం అధిక రేట్లను అరికట్టాలని, బెల్ట్ షాపులను నియంత్రించాలని మండలానికి చెందిన సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ ప్రతినిధులు కలెక్టర్‌కు పిర్యాదు చేశారు. అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

● ఖమ్మం నగరం వేణుగోపాల్ నగర్ కు చెందిన ఎం. వెంకట నరసమ్మ తన ఇంటికి ఆన్‌లైన్ పన్ను జనరేట్ కావడం లేదని, ఇంటి నెంబర్ కూడా తప్పుగా నమోదు అయిందని, వీటిని సరి చేయాలని ఎన్నోమార్లు దరఖాస్తు చేసినా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదంటూ వాపోయింది.

● తిరుమలాయపాలెం మండలం రమణ తండా కు చెందిన ఎం. సునీత ఆశ వర్కర్ గా పని చేస్తున్నానని, ఆరోగ్య సమస్యల వల్ల మధ్యలో విధులకు హాజరు కాలేదని, ప్రస్తుత ఆరోగ్యం కుదుటపడిందని తనకు మరోసారి ఆశ వర్కర్ గా విధులలో చేర్చుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కు రాస్తూ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రాణం తీసిన వేధింపులు

(5వ పేజీ తరువాయి)

పంచాయితీలు జరిగాయి. పోలీసులకు కూడా సత్యంబాబు ఫిర్యాదు చేశాడు.

కాగా, గత శుక్రవారం నాడు సత్యంబాబు పెద్ద కుమారుడు శ్రీధర్ ఇంటివద్ద ఓ మహిళతోపాటు మరికొంతమంది వ్యక్తులు ఆందోళనకు దిగారు. శ్రీధర్ తమ వద్ద అప్పు తీసుకొని చెల్లించడం లేదని వారు తెలిపారు. ఈ క్రమంలో శనివారం సత్యంబాబును, ఆయన కుమారుడు శ్రీధర్‌ను పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించినట్టు తెలిసింది. దీంతో మనస్తాపానికి లోనైన సత్యంబాబు సోమవారం తెల్లవారుజామున తాను రోజు నిద్రించే గదిలోనే పాయిజన్ తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఆరుపేజీల సూసైడ్ నోట్...

సత్యంబాబు ఆత్మహత్య చేసుకున్న గదిలో పోలీస్ కమిషనర్, టూటౌన్ పోలీసులు, కుటుంబ సభ్యుల పేర్లతో ఆరుపేజీల సూసైడ్ నోట్ లభించింది. అందులో తన చిన్న కొడుకు శేఖర్, అతని భార్య సుజాత, బావమరిది గంగాధర్‌లు కలిసి... తన పెద్ద కొడుకు శ్రీధర్ కుటుంబాన్ని, తనను, తన భార్యను చంపడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, రెక్కీలు నిర్వహించారని, తేదీ కూడా నిర్ణయించారని పేర్కొన్నారు. ఆస్తి వివాదాలపై 2017 నుంచి 2024 వరకు చిన్న కొడుకుకు సంబంధించిన వారు పెట్టని కేసు లేదని, పెద్ద మనుషుల్లో పంచాయితీ పెట్టి కాగితాలు రాసిన తర్వాత ఇంకా ఎక్కువ కావాలంటూ పేచీలు పెడుతున్నారనీ తన లేఖలో పేర్కొన్నారు. తాము బాకీ ఉన్న డాక్టర్ కె.మహేంద్ర, పరుచూరి కృష్ణమోహన్‌లతో ఫోన్‌లో మాట్లాడుకుని బజారుకు లాగుతున్నారని, అంతేగాక తాము దివాలా తీస్తున్నామని ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తేజావత్ కళ్యాణి అనే మహిళతోపాటు మరికొంతమందిని తీసుకువచ్చి శ్రీధర్ ఇంటిముందుకు వచ్చి గొడవ చేయించి ఫొటోలు తీయించి లోకల్ పత్రికల్లో వేయించారని సత్యంబాబు పేర్కొన్నారు.

తనను కూడా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన శవం వద్దకు తన చిన్న కుమారుడు శేఖర్‌ను, కోడలు సుజాతను రానివ్వద్దని సత్యంబాబు కోరారు. కాగా కుటుంబ సభ్యుల ద్వారా సత్యంబాబు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న పోలీసులు సూసైడ్ లేఖ ఆధారంగా ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాస్పదంగా మారిన పోలీసుల తీరు

సత్యంబాబు ఆత్మహత్యకు ఖమ్మం టూటౌన్ పోలీసులు వ్యవహరించిన తీరే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత శుక్రవారం వీడీవోస్‌కాలనీలో శ్రీధర్ ఇంటి వద్ద కొందరు వ్యక్తులు భైఠాయించారు. తమకు ఇవ్వాల్సిన బాకీ డబ్బులు ఇవ్వడం లేదని వారు మీడియాని పిలిపించి చెప్పారు. ఈ క్రమంలో సత్యంబాబుతో పాటు, ఆయన కుమారుడు శ్రీధర్‌ను టూటౌన్ పోలీసులు స్టేషన్‌కు పిలింపించారనీ, శుక్రవారం రాత్రి వరకు అక్కడే ఉంచారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరుసటిరోజు ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీధర్‌ను స్టేషన్‌లోనే ఉంచగా, సాయంత్రం సత్యంబాబును మూడు గంటలపాటు స్టేషన్‌లోనే ఉంచినట్టు తెలిసింది.

ఒక సివిల్ కేసుకు సంబంధించి రెండు రోజులపాటు తండ్రీకొడుకులను స్టేషన్‌లో ఉంచడం వెనుక అంతర్యమేంటన్న వాదన వినిపిస్తోంది. వారు స్టేషన్‌లో ఉన్న సమయంలో పోలీసులు దురుసుగా ప్రవర్తించారనే ప్రచారం జరుగుతోంది. ఆ సమయంలో సత్యంబాబు కన్నీరు పెట్టుకున్నారని చెబుతున్నారు. పోలీసుల తీరుతో మనోవేదనకు లోనైన సత్యంబాబు చివరకు ఆత్మహత్యకు పాల్పడ్డారని బంధువులు చెబుతున్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

సత్యంబాబు సూసైడ్ నోట్ ఆధారంగా ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేశారు. సత్యంబాబు చిన్న కుమారుడు శేఖర్, అతడి భార్య సుజాత, బావమరిది గంగాధర్, డాక్టర్ కె.మహేంద్ర, పరుచూరి కృష్ణమోహన్, తేజావత్ కల్యాణిలను నిందితులుగా పేర్కొన్నారు.

లక్ష్మీపురంలో అంత్యక్రియలు

సత్యంబాబు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం రాత్రి ముదిగొండ మండలం లక్ష్మీపురంలో ఉషశ్రీ కాటన్ జిన్నింగ్ మిల్లు ఆవరణలో అంత్యక్రియలు నిర్వహించారు. పెద్ద కుమారుడు శ్రీధర్ తలకొరివిపెట్టారు. నిందితుడిగా వున్న చిన్న కుమారుడు శేఖర్ కుటుంబం అంత్యక్రియలకు రాలేదు.

'సోలార్'.. బేఖార్..

(5వ పేజీ తరువాయి)

పీఎం సూర్యతో పాటు రైతులకు సోలార్ మోటార్లు ఇచ్చేందుకు పలు పథకాలు రూపొందించింది. వ్యవసాయ పంపుసెట్లకు సోలార్ విద్యుత్ వినియోగించి విద్యుత్ పునరుత్పత్తికి ప్రణాళికలు రూపొందించారు. గిరివికాస్ కింద గిరిజన ప్రాంతాల్లో రైతులకు బోర్లు వేసి సోలార్ విద్యుత్‌ను వినియోగించి సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్వయం సహాయక సంఘాల మహిళలకు పెద్దఎత్తున సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటుచేసి వారి ద్వారా విద్యుత్ వ్యాపారాన్ని నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తోంది. ముందుకు వచ్చిన డ్వాక్రా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించి సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటుచేసేందుకు శిక్షణ కార్యక్రమాలు కూడా చేపట్టింది. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర మండలం సిరిపురం గ్రామాన్ని నూరుశాతం సోలార్ విద్యుత్ వినియోగ గ్రామంగా మార్చేందుకు సర్వే నిర్వహించారు. అక్కడ ఇళ్లకు కమర్షియల్‌తో పాటు రైతుల పంపుసెట్లకు అవసరమైన సోలార్ విద్యుత్‌ను అందించడం, మిగిలిన విద్యుత్ అమ్మేందుకు ఇప్పటికే హైదరాబాద్ నుంచి ప్రత్యేక బృందాలు వచ్చి సర్వేచేసి వెళ్లాయి.

ఇళ్లపై సౌర ఫలకాలు...

కేంద్ర ప్రభుత్వ పథకాల కింద రెండు మెగావాట్లకు సోలార్ ప్లాంట్లు వినియోగిస్తే ప్రత్యేక సబ్సిడీ పథకాలు కూడా ఉన్నాయి. దీంతో పాటు ఇటీవల జిల్లాలో ప్రధానమంత్రి జన్‌జాతీయ ఉన్నత గ్రామ అభియాన్(పీఎంజేయూజీఏ) పథకంకూడా ఉమ్మడి జిల్లాలో అమలవుతోంది. ఈపథకం కింద ఎస్టీ, ఎస్సీ, గ్రామాల్లో సోలార్ విద్యుత్ వినియోగం పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కరెంటు సరఫరాకు దూరంగా ఉన్న ఇళ్లకు సోలార్ ప్యానళ్లను అమర్చి మిగులు విద్యుత్‌ను పవర్ కంపెనీలు కొనుగోలు చేసేలా ప్రతిపాదించారు. ఖమ్మం జిల్లాలో 54గ్రామాల్లో 282మంది లబ్ధిదారులను దీనికోసం ఎంపికచేశారు. వీరితోపాటు విద్యుత్ సౌకర్యానికి దూరంగా ఉన్న కామేపల్లి మండలం ఊటవాగు, ఏన్కూరు మండలంలోని కొత్తమేడేపల్లి, పెనుబల్లి మండలంలోని చోడవరం గ్రామాలను కూడా సోలార్ గ్రామాలుగా ఎంపికచేశారు. 109 ఇళ్లకు సోలార్ విద్యుత్ కోసం ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టును జెన్‌కో, సోలార్ ఎనర్జీ అధికారులు సంయుక్తంగా చేయాల్సి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా పలు గిరిజన గ్రామాలను ఈపథకం కింద ఎంపికచేశారు అక్కడ కూడా సోలార్ విద్యుత్ మోటార్లు అమర్చి పోడుభూముల్లో వ్యవసాయాభివృద్ధికి కార్యాచరణ రూపొందించారు. ఉమ్మడిజిల్లాకు సేవలందించే ఖమ్మంజిల్లా మేనేజర్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. రాష్ట్ర విద్యుత్‌శాఖకు ప్రాతనిధ్యం వహిస్తున్న భట్టి విక్రమార్క ట్రాన్స్‌కోను బలోపేతం చేస్తున్న విధంగానే సోలార్ విద్యుత్ ఉత్పత్తి శాఖను బలోపేతం చేయాలి ఉంది.

వైద్య కళాశాలను సమున్నతంగా తీర్చిదిద్దుతాం

(5వ పేజీ తరువాయి)

పెంచాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రిని కోరామని తెలిపారు. ఖమ్మం మెడికల్ కళాశాల భవిష్యత్‌లో పీజీ కళాశాలగా అభివృద్ధి చెందబోతుందని, అలాగే పలురకాల స్పెషలైజేషన్ కోర్సులు కూడా ఏర్పాటుకానున్నాయని మంత్రి వివరించారు. వచ్చే జూన్ 15 నాటికే మెడికల్ కళాశాల భవనాలు పూర్తయ్యేలా వేగంగా పనులు చేపట్టబోతున్నామని, ఇక్కడ హాస్టల్ భవనాలతో పాటు తరగతి భవనాలు ఒక బ్యాచ్‌కు సరిపోయేలా మొదట పూర్తిచేయడం జరుగుతుందని, ఏడాదిలోగా పూర్తిభవనాలు నిర్మాణం జరుగుతుందన్నారు. మెడికల్ కళాశాలకు సమీపంలో స్వామి నారాయణ ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించబోతున్నామని వివరించారు.

వరిసాగులో తెలంగాణ రాష్ట్రం పంజాబ్, హర్యానా, ఆంధ్రప్రదేశ్‌ను దాటి కోటి 53లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రం తెలంగాణ అని మంత్రి తుమ్మల తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా ఒకేదాదిలో రూ.20వేల కోట్లు 25లక్షల మంది రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని, రేషన్‌కార్డు అనుసధానం కాని కుటుంబాలకు ఇంటికి వెళ్లి వారికి కూడా రుణమాఫీచేశామన్నారు.

సన్నధాన్యంకు రూ.500 బోనస్ ఇస్తున్నామని, గతంలో సన్నధాన్యం పండించాలంటే రైతులు ముందుకు వచ్చేవారుకాదని ఇప్పుడు సన్నధాన్యం ఉత్పత్తికే ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు.

ఈవిలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునిల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, మాజీ ఎంపీ రవీంద్రనాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కాంగ్రెస్‌నాయకులు సాధు రమేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా?

ఖమ్మం ఖానాపురం హవేలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా? నాణ్యమైన కూరగాయలతో భోజనం వండుతున్నారా అనే అంశాలను రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సోమవారం కూసుమంచి, జీళ్లచెర్వుతోపాటు నగరంలోని పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన మెనూ ప్రకారం అమలు చేయాలని, విద్యార్థుల చదువుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కాని వసతిగృహాల్లో కాని, కేజీబీవీ, గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎక్కడైనా అలాంటి చర్యలు జరిగితే సంబంధిత అధికారులపై శాఖపరమైన కఠిన చర్యలు తప్పవని అన్నారు. రఘునాథపాలెంలోని మైనారిటీ బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సౌకర్యాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈవో సోమశేఖర శర్మ, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ అధికారి జ్యోతి, విద్యాశాఖ కార్యాలయ సీఎంవో రాజశేఖర్, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విజయలక్ష్మి, మైనారిటీ పాఠశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి పాల్గొన్నారు.



కూరగాయలను పరిశీలిస్తున్న చైర్మెన్



అద్దె బస్సు భద్రత తుస్సు

- డ్రైవర్లకు శిక్షణ లేక ప్రమాదాలు
- పట్టించుకోని హైర్ బస్సుల యజమానులు
- తక్కువ వేతనాలకు నైపుణ్యం లేని చోదకులు
- స్పీడ్ లాక్ లేకపోవడంతో యాక్సిడెంట్లు
- మహాలక్ష్మి పథకంతో పెరిగిన ప్రయాణికులు

ఖమ్మం ఖానాపురంహవేలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రోజురోజుకు ఆర్టీసీ అద్దె బస్సుల ప్రమాదాలు పెరుగుతున్నాయి. అద్దె బస్సుల డ్రైవర్లకు సరైన శిక్షణ లేకపోవడమే ఇందుకు కారణం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 200 అద్దె బస్సులు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా డ్రైవర్లకు డ్రైవింగ్‌పై అవగాహన లేక నిత్యం ఏదోఒక ప్రాంతంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. అద్దె బస్సులకు స్పీడ్ లాక్ సిస్టిమ్ లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణంగా మారింది. ఉమ్మడి జిల్లాలో గత ఆరు నెలలుగా జరిగిన ప్రమాదాల్లో అధికంగా ఖమ్మం డిపోకు చెందిన ఆరు అద్దె బస్సులు ఉన్నాయి. సత్తుపల్లిలో ఒకటి, కొత్తగుడెంలో ఒకటి, మణుగురులో ఒక అద్దె బస్సులు వివిధ ప్రాంతాల్లో జరిగిన ప్రమాదాలకు గురయ్యాయి. అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగానే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు. ఆర్టీసీ బస్సుల

ఏడేళ్లుగా డ్రైవర్ పోస్టు భర్తీ లేదు..

ఆర్టీసీలో ప్రస్తుతం కొత్త డ్రైవర్ పోస్టుల భర్తీ లేకపోవంతో డ్రైవర్ల సంఖ్య భారీగా తగ్గుతోంది. ఏడేళ్లుగా డ్రైవర్ నియామకాలు లేవు. కొత్త ప్రాంతాలకు బస్సులను నడపాలంటే ఆర్టీసీకి సొంత డ్రైవర్లు లేని పరిస్థితి నెలకొంది. అద్దె బస్సులు పెరగటం వల్ల ప్రయాణికులకు నేరుగా జరిగే నష్టం లేదు. కానీ వాటికి కనీస శిక్షణ, అనుభవం లేని వారు డ్రైవర్లుగా రావటమే అసలు సమస్యగా మారింది.

అద్దె డ్రైవర్లకు తక్కువ వేతనాలు

ఆర్టీసీ సొంత డ్రైవర్ల సగటు వేతనం రూ.40 వేలు. ఒక డ్రైవర్ డ్యూటీ ముగించుకోగానే మరో డ్రైవర్ బస్సు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ అద్దె బస్సులకు చెల్లించే మొత్తంలో డ్రైవర్ వేతనం కేవలం రూ.13 వేల నుంచి రూ.15వేలు మాత్రమే చెల్లించి నిర్వాహకులు ఒక్కో బస్సుకు ఇద్దరు డ్రైవర్లను నియమిస్తున్నారు. అంటే నెలకు సుమారు రూ.30 వేలు చెల్లిస్తున్నారు. ఇంత తక్కువ వేతనంతో పని చేసేందుకు నైపుణ్యం ఉన్న డ్రైవర్లు ఆసక్తి చూపడం లేదు. దీంతో తక్కువ వేతనం కోసం వచ్చేవారిని నియమించుకుంటున్నారు.

ట్రాక్టర్, ఆటో డ్రైవర్లకు బస్సులు...

ఆటో, లారీ, ట్రాక్టర్‌లను నడిపిన డ్రైవర్లలో హెవీ లైసెన్స్ ఉన్న వారిని తక్కువ జీతాలకు మాట్లాడుకోని అద్దె బస్సులను అప్పగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ డ్రైవర్లపై ఆర్టీసీ అధికారులకు ఎటువంటి అధికారాలు ఉండవు. దీంతో ఆ డ్రైవర్ బస్సులను నిర్లక్ష్యంగా నడిపి ప్రమాదాలకు గురికావల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బస్సు నడిపేందుకు హెవీ మోటార్ వెహికిల్ లైసెన్సు, ఆర్టీసీ ఆసుపత్రి జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉంటే చాలన్నట్లు వారి నియామకానికి అంగీకరిస్తున్నారు. ఈ రెండు సులభంగానే లభిస్తున్నాయి. కానీ కీలకమైన శిక్షణ, అనుభవం మాత్రం వారికి ఉండట్లేదు.

ప్రయాణికుల సంఖ్య

గత ప్రభుత్వ హయంలో ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం ఏర్పాటు చేయటంతో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. ఆర్టీసీ అధికారులు అందుకు తగ్గట్టుగా బస్సుల సంఖ్యను పెంచకపోవటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆర్టీసీ యాజమాన్యం అద్దె బస్సులను తీసుకోని ప్రయాణికులకు కొంత ఇబ్బందులు లేకుండా చూస్తుంది. కాని ఆ అద్దె బస్సుల డ్రైవర్లపై నియంత్రణ లేక కొందరు డ్రైవర్లు నిర్లక్ష్యంగా బస్సులు నడిపి ప్రమాదాలకు కారణం అవుతున్నారు.



'ఆకాశ్'మే హద్దుగా...

- ఇండియన్ నేవీలో సబ్ లెఫ్టినెంట్‌గా ఏన్కూరు యువకుడు

ఏన్కూరు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు మండలం నూకాలంపాడు మారుమూల గ్రామ యువకుడు పెద్దప్రోలు ఆకాశ్ భారతతూర్పు నౌకాదళ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కఠిన శిక్షణను ఎదుర్కొని సబ్ లెఫ్టినెంట్‌గా నియమితుడయ్యాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో విజయం సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బాబురావు, శ్రీదేవి దంపతుల కుమారుడు ఆకాష్ డెహ్రాడూన్‌లో రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీలో 10+2 పూర్తిచేశాడు. నేషనల్ డిఫెన్సు అకాడమి ఎన్డీయే ప్రవేశ పరీక్ష రాసి కోల్‌కతలో సర్వీస్ సెలక్షన్ బోర్డు ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ ఇన్ అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ఆసియాలోనే నెంబర్ వన్ అయిన కేరళ విజుమాలలోని ఇండియన్ నావెల్ అకాడమిలో నౌకాదళ శిక్షణలో ఉత్తీర్ణత సాధించాడు. ఈఏడాది నవంబరు 29న జరిగిన ఇండియన్ నావల్ అకాడమి 107వ స్నాతకోత్సవంలో ఇస్రో మాజీ ఛైర్మన్ రాధాకృష్ణన్ నుంచి పట్టా అందుకున్నాడు. నౌకాదళం అతణ్ని సబ్ లెఫ్టినెంట్‌గా నియమించింది. ఏపీలోని విశాఖపట్నం తూర్పునౌకాళ కమాండెంట్‌కు కేటాయించింది. ఆకాశ్ మాట్లాడుతూ యువత రక్షణ రంగం వైపు రావాలని కోరారు.



తల్లిదండ్రులతో ఆకాశ్

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి: పీవో

టేకులపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థిలోను అంతర్గతంగా సృజనాత్మకత ఉంటుందని, వాటిని వెలికితీసేందుకు ఉపాధ్యాయులు పోత్సహించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ సూచించారు. సోమవారం మండలంలోని కోయగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ పీవో రాహుల్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పాఠశాల వంటగది, వంటపాత్రలు, స్టోర్‌రూంను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులను ఉద్దీపకము పుస్తకాల గురించి ప్రశ్నలడిగి బ్లాక్ బోర్డుపై రాయించారు. ఉత్తమ సమాధానాలు చెప్పిన విద్యార్థులకు పెన్నులు, నోట్‌పుస్తకాలను బహుమతులుగా అందజేశారు. 9,10వ తరగతులను సందర్శించి పరిశీలించారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో రాధ, పాఠశాల హెచ్ఎం అమర్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఆశా' వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మం బైపాస్‌రోడ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆశావర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం బీజేపీ పార్లమెంట్ కంటెస్టెడ్ అభ్యర్థి, రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఆశావర్కర్లు గ్రామాలలో వైద్య సేవలందించడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని, అయినా కూడా ప్రభుత్వాలు వారి సమస్యలు పట్టించుకోవడంలేదని తాండ్ర వినోదరావు అన్నారు. వారి సమస్యలనుప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తగిన కృషిచేస్తానని వారికి హామీ ఇచ్చారు.

ఈకార్యక్రమంలో నంబూరి రామలింగేశ్వరరావు, రవి, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, సుదర్శన్, జ్వాలా గౌడ్, రుద్రగాని మాధవ్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి

- కుంకుమ పూజలు, నదీ స్నానాలు
- ఆలయాల్లో భక్తుల రద్దీ..
- గుంటుమల్లేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించిన మంత్రి తుమ్మల

ఖమ్మం సాంస్కృతికం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమి పర్వదినాన్ని సోమవారం ఖమ్మం నగరంతోపాటు జిల్లావ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆధ్యాత్మిక వాతావరణం వెల్లి విరిసింది. తెల్లవారు ఝామునుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలను సందర్శించారు.

సాధారణ భక్తులతోపాటు రాష్ట్ర వ్యవసాయ, గిడ్డంగులు, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోలిపాడ్యమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఖమ్మంలోని గుంటుమల్లేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు, అర్చకులు అధికారులు మంత్రిని సంప్రదాయబద్ధంగా వేదమంత్రాలతో ఆలయంలోకి స్వాగతించారు. మంత్రి పేరున అర్చనలు చేశారు. భక్తులు పోలిపాడ్యమిని పురస్కరించుకొని నదీస్నానాలు ఆచరించటంతోపాటు మహిళలు దీపాలను వెలిగించి సంప్రదాయం పాటించారు. కార్తీక మాసం ముగిసి మార్గ శీర్ష మాసం మొదలవటంతో శివ ఆరాధన ముగిసి విష్ణు ఆరాధన ప్రారంభమైంది.



గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయంలో పూజల్లో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నేడు మంత్రి పొంగులేటి పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9.00 గంటలకు ఖమ్మం నుంచి బయలుదేరి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాకు ఉదయం 10గంటలకు చేరుకొని మధ్యాహ్నం 2.40 గంటల వరకు జూలూరుపాడు మండలంలో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 3.00 గంటలకు కూసుమంచి మండలం జీల్లచెరువులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3-30 గంటలకు మల్లేపల్లి, సాయంత్రం 4 గంటలకు గట్టు సింగారం, 4.30 గంటలకు నరసింహులగూడెం, 5 గంటలకు కూసుమంచి గ్రామంలో పర్యటించి సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం కూసుమంచిలోని క్యాంప్ కార్యాలయంలో కూసుమంచి మండల లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్. చెక్కులను అందజేస్తారు. సాయంత్రం 6 గంటలకు బయలుదేరి హైదరాబాద్ వెళ్లనున్నారు. మంత్రి పర్యటనకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

కేజీబీవీలో గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తులు

జూలూరుపాడు/ దుమ్ముగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జూలూరుపాడులోని కస్తూర్బా గాంధీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టుల భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కేజీబీవీ ప్రత్యేక అధికారి ఎం.పద్మజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఇంగ్లీష్, జువాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సీఆర్‌టీ ఇంగ్లీష్ పోస్టుకు డిగ్రీ, బీఈడీ, జువాలజీ పోస్టుకు పీజీ, బీఈడీ చేసిన మహిళలు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 5వ తేదీ నాటికి విద్యాయంలో అందించాలని ఆమె కోరారు. **దుమ్ముగూడెంలో..** దుమ్ముగూడెం కస్తూర్బా పాఠశాలలో ఫిజిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌వో శోభారాణి సోమవారం తెలిపారు. అన్ని కులాల వారు 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డిగ్రీ, పీజీ, బీఈడీ, టెట్ విద్యార్హతలుగా ప్రకటించారు.

రామయ్యకు రూ.4 లక్షల ముత్యాలహారం

భద్రాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి రూ.4 లక్షల విలువైన ముత్యాలహారాన్ని హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌కు చెందిన భక్తులు దీపక్ కుటుంబ సభ్యులు అందజేశారు. సోమవారం భద్రాద్రి రామయ్యను దర్శించిన వారి కుటుంబ సభ్యులు స్వామి వారికి ముత్యాల హారాన్ని సమర్పించగా దానిని లాంఛనంగా దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాసరావుకు అందజేశారు.

పారా మెడికల్ కళాశాల ప్రారంభం

కొత్తగూడెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం ఆరోగ్య దినోత్సవ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హైదరాద్ నుంచి వర్చువల్ విధానం ద్వార రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ కాలేజీలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం పట్టణంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన పారామెడికల్ కళాశాలను సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ పారామెడికల్ కళాశాలలో 30 డీఎంసీటి, 30 డయాలసిస్ సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్, డాక్టర్లు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



పారామెడికల్ కళాశాలను ప్రారంభిస్తున్న కలెక్టర్

క్రైం సమాచారం

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన కొత్తగూడెం రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్‌పీ ఎస్ఐ జె.సురేష్ సోమవారం వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గాజులగూడెం - పాండురంగాపురం రైల్వే స్టేషన్ మధ్యన కేఎం నెం. 70/9 -10 వద్ద రైలు కింద తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెంది పడిపోయి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయస్సు సుమారు 25 - 28 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై సిమెంట్ రంగు టీషర్టు, బ్లాక్ కలర్ పాయింట్, మెరూన్ కలర్ పుమా స్వెటర్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేవని పేర్కొన్నారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతదేహాన్ని కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి మార్చ్యూరీలో భద్రపరిచామన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 998902548, 8712658600, 0701371472 ఫోన్‌నెంబర్లలో సమాచారం ఇవ్వాలని కోరారు.

స్కూల్ బస్సును ఢీకొన్న కారు..

- తప్పిన పెను ప్రమాదం



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టి ఆగిన బస్సు, నుజ్జునుజ్జయిన కారు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌ను తప్పించబోయిన కారు ఒకటి స్కూల్ బస్సును ఢీకొట్టిన సంఘటన సోమవారం సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన మదర్‌థెరిస్సా స్కూల్ బస్సు తాళ్లమడ వైపు నుంచి సత్తుపల్లికి సుమారు 50మంది విద్యార్థులతో వస్తోంది. అదే సమయంలో కిష్టారం గ్రామానికి చెందిన గడ్డం రాజు తన కుటుంబ సభ్యులతో కలసి కారులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో మొద్దులగూడెం సమీపంలో వేంచేసియున్న ఏకులపోతమ్మ తల్లి ఆలయం వద్దకు వెళ్తున్నారు. ఈ క్రమంలో హనుమాన్ నగర్ వద్ద హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదుట సైకిల్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని తప్పించబోయిన కారు అదుపుతప్పింది. తాళ్లమడ వైపు నుంచి వస్తున్న స్కూల్‌బస్సును ఢీకొంది. దీంతో పక్కనే ఉన్న రిలయన్స్ బంక్‌లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను స్కూల్ బస్సు ఢీకొని ఆగింది. దీన్ని గమనించిన స్థానికులు బస్సును పక్కకు తీసి విద్యార్థులను దింపి వేసి మరో బస్సులో స్కూల్‌కు తరలించారు. కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురికి ఎటువంటి గాయాలు కాలేదు. కాగా పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి స్వాధీనం

ఖమ్మం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొన్నేండ్లుగా ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమికి సర్వే చేసి హద్దుల ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని తల్లంపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 409 లోని సుమారు 4 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. ఈ విషయం తెలుసుకున్నటు తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్ తన సిబ్బందితో సోమవారం ఆ నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని సర్వే చేయించగా సుమారు 4 ఎకరాల భూమి తేలింది. ఈ భూమికి వెంటనే హద్దులు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతు ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమి సుమారు రూ.10 కోట్ల విలువ చేస్తుందని తెలిపారు. ఈ భూమిని ప్రభుత్వ అవసరాలకు వినియోగిస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములు ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించేదిలేదని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ

ప్రజలను మోసం చేస్తున్న రేవంత్ సర్కార్

- బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

మధిర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆరుగ్యాంటీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ వాటిని అమలుచేయడంలో ప్రజలకు మొండిచేయి చూపించి మోసం చేస్తోందని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి విమర్శించారు. సోమవారం మధిరలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ 420 హామీలుగా పేర్కొన్నారు. ఏడాది పాలనలో ఏఒక్క హామీకూడా పూర్తిగా అమలుచేయకుండా సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికీ రైతు రుణమాఫీ పూర్తిగా అమలుకాలేదని, రైతు భరోసా ఊసేలేదని, రేషన్‌కార్డులు, మహిళలకు రూ. 2500 పథకం, పేదలకు ఇళ్ల ఇవ్వకుండా ఏడాది పాలన అంతా కాగితాలకే పరిమితమైందని ఆరోపించారు. కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీల అమలుకు ప్రజలతో కలిసి ఉద్యమాలు చేయడానికి తమ పార్టీ సిద్ధమవుతుందని తెలిపారు. ఈసమావేశంలో మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరు నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి చిలువేరు సాంబశివరావు, అధికారప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు పాపట్ల రమేష్, మండల అధ్యక్షుడు గుండాల చంద్రశేఖర్‌రెడ్డి, ఎర్రుపాలెం మండల అధ్యక్షులు నూతక్కి నర్సింహారావు, కుంచం కృష్ణారావు, స్వర్ణాకర్, దేవరకొండ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు అమలుచేయని తీరుపై కరపత్రాన్ని విడుదల చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

7 నుంచి సీఎం కప్

- క్రీడా పోటీల షెడ్యూల్ విడుదల
- ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పల్లెల నుంచి ప్రపంచస్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా, రాబోయే రోజుల్లో 2028 ఒలింపిక్స్ పోటీల్లో ఖచ్చితంగా తెలంగాణా రాష్ట్రం నుంచి పతకాలు సాధించాలనే తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. సోమవారం గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీల షెడ్యూల్‌ను డీవైఎస్‌వో సునిల్‌రెడ్డి ప్రకటించారు.

ఈనెల 7, 8 తేదీలలో గ్రామస్థాయిలో, 10, 12 తేదీలలో మండల, మునిసిపల్ స్థాయిలో, ఈనెల 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలో, డిసెంబరు 27 నుంచి జనవరి 2 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్ పురుషులు, మహిళల విభాగంలో నిర్వహించనున్నారు. గ్రామ, మండల, మున్సిపాలిటీ స్థాయి పోటీలలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, యోగా పోటీలు ఉంటాయి. జిల్లా స్థాయి పోటీలలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, రెజ్లింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, యోగా, చెస్, బేస్‌బాల్, నెట్‌బాల్, కిక్‌బాక్సింగ్, సైక్లింగ్, ఉషూ, జూడో, బిలియర్డ్స్, స్నూకర్స్ విభాగాలలో పోటీలు ఉంటాయి. రాష్ట్రస్థాయిలో జిల్లాస్థాయి పోటీలలో నిర్వహించే క్రీడలతో పాటు ఆర్చరీ, స్విమ్మింగ్, టేబుల్‌టెన్నీస్, లాన్‌టెన్నిస్, వెయిట్ లిఫ్టింగ్, జిమ్నాస్టిక్స్, షూటింగ్, హాకీ, సెపక్ తక్రా, కరాటే, రోయింగ్, స్క్వాష్, కెనోయింగ్ అండ్ కాయకింగ్, అట్యాపట్యా, పవర్‌లిఫ్టింగ్, సాఫ్ట్‌బాల్, తైక్వాండో విభాగాలలో పోటీలు ఉంటాయి. విజేతలకు వ్యక్తిగత విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు నగదు బహుమతులు, టీమ్ విభాగంలో ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75వేలు, తృతీయ బహుమతిగా రూ.50వేల నగదు బహుమతులు ఇవ్వనున్నారు. ఆసక్తి గల వారు cmcup2024.telangana.gov.in వెబ్‌సైట్‌లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ఘాటీ ప్రయాణంలో పర్యావరణ నిర్వహణ చార్జీలు

- జీవో నెం.35ను జారీ చేసిన ఏపీ
- ఈఎంసీ తనిఖీ కేంద్రాల ఏర్పాటు

భద్రాచలం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం నుంచి రాజమండ్రికి వయా చింతూరు మీదుగా వెళ్లే ఘాటీ ప్రయాణంలో పర్యావరణ నిర్వహణ చార్జీలను ఏపీ ప్రభుత్వం వసూలు చేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే జీవో నెం.35ను ప్రభుత్వం జారీ చేయగా రాజమండ్రి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు బీఎస్ఎన్ మూర్తి ఈ జీవోను అమలు చేయాలని సంబంధిత అటవీ శాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. భద్రాచలం నుంచి రాజమండ్రి వయా చింతూరు మీదుగా వెళ్లాలంటే సుమారు 200 కి.మీ. ఉంది. ఈ మార్గంలో ఇక నుంచి వెళ్లే వాహనదారుల నుంచి ఈఎంసీ (ఎన్విరాన్‌మెంటల్ మెయింటనెన్సు చార్జీ) వసూలు చేయనున్నారు. కారు తుఫాను, టెంపో, వ్యాను తదితర వాటికి రూ.50, బస్, లారీ తదితర భారీ వాహనాలకు రూ.100 చొప్పున వసూలు చేయనున్నారు. ఇందుకోసం చింతూరు వైపు నుంచి వెళ్లే వాహనాలకు తులసిపాక వద్ద, రాజమండ్రి నుంచి చింతూరు వచ్చే వాహనాలకు మారేడుమిల్లి వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు.

ఏజెన్సీ ప్రాంతంలో పర్యటిస్తున్న సమయంలో పర్యాటకులు, వాహనదారులు ఇష్టానుసారంగా విచ్చలవిడిగా ప్లాస్టిక్ బాటిల్స్, చెత్త చెదారం వదిలేస్తున్నారని అటవీ అధికారులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఈ చెత్తను స్థానికుల సహకారంతో సేకరించేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. దీని ద్వారా పరోక్షంగా స్థానికులకు ఉపాధి లభిస్తుందని వారు పేర్కొంటున్నారు. ప్రయాణికులు, పర్యాటకులు చెత్తను ఇష్టానుసారంగా పడేసి ఏజెన్సీ అందాలను కలుషితం చేయవద్దని అటవీ అధికారులు కోరుతున్నారు. ఇటీవల నుంచి పాపికొండలు, పేరంటాలపల్లి బోట్ యజమానుల నుంచి సైతం ప్రతి బోటుకు రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు చార్జీలను అటవీశాఖ వసూలు చేస్తోంది.



తులసిపాక చెక్‌పోస్టు వద్ద ఏర్పాటు చేసిన ఈఎంసీ కేంద్రం

పర్యాటకుల రక్షణ చర్యలపై దృష్టి

చింతూరు, మారేడుమిల్లి ఏజెన్సీ అందాలను తిలకించడానికి తరలివచ్చే పర్యాటకుల రక్షణ చర్యలపై సైతం అటవీశాఖ దృష్టిసారించింది. . మోతుగూడెం జలపాతం వద్ద పర్యాటకులు ప్రమాదకరస్థాయి పరిస్థితికి వెళ్లకుండా అటవీ శాఖ అధికారులు రక్షణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా జలపాతం వద్ద పటిష్ఠమైన ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

మురుగుపై ట్విట్టర్‌లో ఫిర్యాదు

శుభ్రం చేసిన కేఎంసీ అధికారులు



ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక 23వ డివిజన్‌కు చెందిన సాధిక్ తన నివాసం ఎదుట మురుగు నీరు నిల్వలు ఉండి, దోమలు పెరిగిపోవటంతో ఫొటోలను సోమవారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ట్విట్టర్ చూసిన కేఎంసీ అధికారులు తక్షణమే స్పందించారు. మురుగునీరు నిల్వలను ట్యాంకర్లకు లోడింగ్ చేసి తొలగించారు. దీంతో తిరిగి కేఎంసీ అధికారులకు కృతజ్ఞతలు చెపుతూ ఫిర్యాదుదారుడు ట్వీట్ చేశారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	50 రూ.
వంకాయ	34
గుత్తి వంకాయ	50
బీరకాయ	54
పచ్చిమిర్చి	28
కాకరకాయ	34
బెండకాయ	24
పొట్లకాయ	34
దోసకాయ	30-48
చిక్కుడు	64
నాటుచిక్కుడు	84
గోరుచిక్కుడు	38
క్యాబేజీ	38
దొండ	38-44
సొరకాయ	28
క్యారెట్	68
క్యాప్సికం	68
ఆలుగడ్డ	36
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	190
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కేశవ చంద్రరమావత్
తిరుమల:	రోటీ కపడా రోమాన్స్
సినీ గెలాక్సీ:	జీబ్రా

డివిజన్ కార్పొరేటర్ సెల్‌నెంబర్

1	తేజావత్ హుస్సేన్	98485 29188
2	మలీదు వెంకటేశ్వర్లు	99497 01116
3	మలీదు జగన్	....
4	దండా జ్యోతిరెడ్డి	98669 25591
5	పల్లెబోయిన భారతి	95538 53111
6	నాగండ్ల కోటేశ్వరరావు	90630 12222
7	దొంగల సత్యనారాయణ	81065 01875
8	లకావత్ సైదులునాయక్	98483 81719
9	షేక్ జాన్‌బీ	77996 85786
10	చావా మాధురి	80968 64444
11	సరిపూడి రమాదేవి	99482 78404
12	చిరుమామిళ్ల లక్ష్మీ	98493 29742
13	కొత్తపల్లి నీరజ	98483 16224
14	కూరాకుల వలరాజు	99498 97577
15	రాపూరి కరుణ	92466 63945
16	మేడారపు వెంకటేశ్వర్లు	99126 44608
17	దనాల రాధా	95504 04444
18	మందడపు లక్ష్మీ	98480 18571
19	సీహెచ్ వెంకటనారాయణ	98485 88233
20	వీ ప్రశాంతలక్ష్మీ	98856 92345
21	ఆళ్ల నిరీశ	99487 14489
22	పల్లా రోశిలీనా	76599 87283
23	షేక్ మక్బూల్	98482 38953
24	కమర్తపు మురళీ	98859 74455
25	గోళ్ల చంద్రకళ	99495 29273
26	పునుకొల్లు నీరజ	94901 45220
27	దోడ్డా నాగేశ్వరరావు	88970 28299
28	గజ్జెల లక్ష్మీ	97019 23269
29	కొప్పెర సరిత	98489 41843
30	ముక్కల కమల	98483 04794
31	యర్రా గోపీ	77020 00447
32	జీనవాన్ సరస్వతి	96764 86370
33	తోటా ఉమారాణి	99511 25339
34	రుద్రగాని శ్రీదేవి	98496 34889
35	యల్లంపల్లి వెంకట్రావు	83282 18768
36	పసుమర్తి రామోహ్మన్‌రావు	98487 76665
37	షేక్ ఫాతిమాజోహారా	92465 55786
38	ఆలియా	98482 12872
39	మాధురి ప్రసాద్	98485 32871
40	దాడే అమృతమ్మ	96666 74646
41	కర్నాటి కృష్ణమూర్తి	99082 90555
42	పాకాలపాటి విజయనిర్మల	85001 65089
43	క్లైమెట్	98484 12449
44	పాలేపు విజయ	98669 25900
45	బుడిగెం శ్రీనివాస్	93993 70776
46	కర్నం వైష్ణవి	99668 66937
47	మాట్టేటి అరుణ	94403 58041
48	తోట గోవిందమ్మ	98480 15948
49	దుద్దుకూరి వెంకటేశ్వర్లు	98484 20471
50	రాపర్తి శరత్‌కుమార్	94940 43399
51	శీలంశెట్టి రమా	99492 28833
52	బుర్రి వెంకటేశ్వర్లు	99895 70941
53	పగడాల శ్రీవిద్య	94400 05558
54	మిక్కిలినేని మంజు	93969 66478
55	మోతారపు శ్రావణి	82975 49999
56	పగిడిపల్లి రోహిణి	98485 89580
57	మహ్మద్ రఫీదాబేగం	94901 88786
58	దోరేపల్లి శ్వేత	99639 07909
59	బట్టపోతుల లలితారాణి	81878 71700
60	బడ్డే నిరంజన్‌కుమార్	99667 72453

పరిధి ఎక్కువ.. నిధులు తక్కువ

» అధ్వానంగా లింక్‌రోడ్లు, డ్రెయినేజీ సమస్య
» తాగునీటికీ ఇబ్బందులు
» 14వ డివిజన్‌ను వేధిస్తున్న సమస్యలు

డివిజన్ విజిట్



ధ్వంసం అయిన డ్రెయినేజీ



గొల్లగూడెం నుంచి అల్లీపురం వెళ్లే రహదారి



గొల్లగూడెం నుంచి మధురానగర్‌కు వెళ్లే రహదారి

ఖమ్మంటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని అతిపెద్దదైన 14 డివిజన్ అభివృద్ధిలో వెనుకబడింది. నిధుల కొరత కారణంగా వసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఖమ్మం నగరపాలకసంస్థగా రూపొందించినప్పుడు కొన్ని పంచాయతీలను అందులో విలీనం చేసి డివిజన్లుగా మార్చారు. గతంలో ఉన్న గొల్లగూడెం పంచాయతీని పూర్తిగా, కొత్తగూడెం పంచాయతీని కొంతమేరకు, రుద్రంకోటలో కొంత ప్రాంతాన్ని కలిపి 14వ డివిజన్‌ను ఏర్పాటు చేశారు. అతి ఎక్కువ పరిధిగల ఈ డివిజన్‌లో సమస్యలు అధికంగా ఉన్నాయి. ఇప్పటికీ మట్టి రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగాఉంది. విలీన గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డివిజన్‌లో నెలకొన్న సమస్యలివీ.

15కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న 14వ డివిజన్‌లో పలు సమస్యలు నెలకొన్నాయి. డివిజన్‌లో ప్రధాన రహదారులు అభివృద్ధి చెందినప్పటికీ విలీన గ్రామాల్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ముఖ్యంగా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రహదారుల పరిస్థితి ఘోరంగా ఉంది. వర్షం వస్తే నీళ్లు నిలిచి,బురదతో నడిచేందుకు వీలుకాకుండా ఉన్నాయి. గొల్లగూడెం పరిధిలోని పాత రాజన్నపేట నుంచి అల్లీపురానికి వెళ్లే రహదారి మట్టి రహదారిగా ఉంది. ఇక్కడ సీసీ రహదారిని నిర్మించాలని ప్రజలు ఎన్నో ఏళ్లుగా కోరుతున్నారు. ఈ రహదారి నిర్మాణం జరిగితే చింతకాని మీదుగా మధిర వరకు వెళ్లవచ్చు. దీంతో ప్రయాణభారం తగ్గుతుంది. ఇక గొల్లగూడెం నుంచి మధురానగర్‌కు వెళ్లే రహదారి గోతులతో ఉంది. మామూలు సమయాల్లో వాహనాలు వెళ్లటం కష్టంగా ఉండగా, ఇక వర్షం పడితే నరకం కనిపిస్తుంది. చెరుకూరి వారితోట, కొత్తగూడెం, మధురానగర్‌కు వెళ్లే రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కొత్తగూడెంలో మిషన్ భగీరథ కింద పైప్‌లైన్లు వేసినా, కనెక్షన్‌లు ఇవ్వలేదు. దీంతో అక్కడి ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడుతున్నారు. మధురానగర్, గోపాలపురం, కొత్తగూడెం, గొల్లగూడెంలలో పలుచోట్ల డ్రెయినేజీ సమస్య అధికంగా ఉంది.

జరిగిన అభివృద్ధి ఇదీ...

డివిజన్‌లో 8ఏళ్ల వ్యవధిలో సుమారు రూ.15కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. మధురానగర్, కొత్తగూడెం, గోపాలపురం, గొల్లగూడెం తదితర ప్రాంతాల్లో రహదారులను విస్తరించి, సీసీ రహదారులు నిర్మించారు. మధురానగర్, గొల్లగూడెం వెళ్లే ప్రధానా రహదారులను అభివృద్ధి చేశారు. కొత్త డ్రెయినేజీలు నిర్మించారు. చెరుకూరివారి తోట మీదుగా కొత్తగూడెం వెళ్లే రహదారిని వెడల్పు చేయటంతో వాహనదారులకు సౌకర్యంగా మారింది.

14వ డివిజన్ స్వరూపం

విస్తీర్ణం: సుమారు 15కిలోమీటర్లు
జనాభా: సుమారు 15వేలు, ఓటర్లు :5150
డివిజన్ ప్రాంతాలు: మధురానగర్, సత్యసాయి నగర్, గొల్లగూడెం, కొత్తగూడెం, రుద్రమకోట, గోపాలపురంలో కొన్ని ప్రాంతాలు
కార్పొరేటర్: కూరాకుల వలరాజు ఫోన్ 99498 97577

రహదారులు గుంతలమయం



ఎస్‌కే.జానీ

విలీనపంచాయతీల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే అనుసంధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వాటిని సీసీ రహదారులుగా నిర్మించాలి. గొల్లగూడెం నుంచి ఇతర కొత్తగూడెం, మధురానగర్, అల్లీపురం వెళ్లే రహదారులు మట్టిరోడ్డుగా ఉండటంతో పాటు గుంతల మయంగా ఉన్నాయి. వర్షం వస్తే నడిచేందుకు కూడా వీలు ఉండదు. అధికారులురహదారుల నిర్మాణంపై దృష్టి పెట్టాలి.

డ్రెయినేజీలు నిర్మించాలి



ఎస్. నర్సయ్య

డివిజన్‌లోని పలుప్రాంతాల్లో డ్రెయినేజీ నిర్మాణాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. పాత డ్రెయినేజీలు శిథిలమయ్యాయి. రహదారుల పక్కనే మురుగునీరు నిలువ ఉంటోంది. దోమలు వ్యాపిస్తున్నాయి. ప్రణాళిక ప్రకారం మురుగు పారేలా డ్రెయినేజీ నిర్మాణాలను చేపట్టాలి. డివిజన్‌లో ఖాళీప్రదేశాల్లో చెత్త పెరుగుతోంది. దీనిపై అధికారులు దృష్టి సారించాలి

నిధులు కేటాయించాలి



కూరాకుల వలరాజు, డివిజన్ కార్పొరేటర్

అతిపెద్ద డివిజన్ అయిన 14వ డివిజన్‌కు ఎక్కువ నిధులు కేటాయిస్తేనే అభివృద్ధి పనులు చేయగలుగుతాం. డ్రెయినేజీలు, రహదారుల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. విలీన పంచాయతీల్లో అభివృద్ధిపనులు చేపట్టాల్సి ఉంది. ముఖ్యంగా డ్రెయినేజీలు, సీసీ రహదారులు నిర్మించాల్సి ఉంది. డివిజన్ విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకొని నిధులు కేటాయించాలి.

అందుబాటులోకి ఐసీటీసీ మొబైల్ వాహనం

» ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఐసీటీసీ మొబైల్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లాలో హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించే లక్ష్యంతో ఈ అంబులెన్స్‌ను గతంలో ఏర్పాటు చేశారు. మూలనపడిన ఈ వాహనాన్ని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ, ట్రెయినీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి సోమవారం ప్రారంభించారు. మూడు నెలలుగా ఈ వాహనం మూలకు పడి ఉండటంపై గతనెల16న ఆంధ్రజ్యోతిలో 'మొబైల్‌వాహనాన్ని అందుబాటులోకీ తేరు' అంటూ కథనాన్ని ప్రచురించింది. ఎట్టకేలకు సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి. కళావతిబాయి, అదనపుడీఎంహెచ్‌వో డి.రామారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు, జాగృతి ఎన్‌జీవో ప్రోగ్రాం మేనేజర్ కె.కొండలరావు, జిల్లా ఎయిడ్స్ నివారణ నియంత్రణ యూనిట్ ప్రతినిధుల పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్నేహితులు ఎవరైనా ఇటువంటి వ్యసనాలకు లోనైతే సామాజిక బాధ్యతగా బాధితుల వివరాలు సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ కలెక్టర్ మృణాల్‌ఠాకుర్, కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, డీడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి, సీడీపీవో విష్ణువందన, మాదకద్రవ్యాల నిర్మూలకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

జీవనభృతి రూ.12వేలు ఇవ్వాలి: ఏఐపీకేఎస్

ఖమ్మం సంక్షేమవిభాగం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి జరుగుతున్నా ఎన్నికల హామీలను అమలు చేయలేదని, తక్షణమే వ్యవసాయ కార్మికులకు జీవనభృతి కోసం రూ.12వేలు మంజూరు చేయాలని ఏఐపీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మికులతో కలిసి నాయకులు నిరసన ధర్నా చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర చట్టం అమలు చేయాలని కోరారు. 13డిమాండ్లుతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి అందించారు. సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బందెల వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు రేపాకుల శివలింగం, తిమ్మిడి హనుమంతరావు, కంకణాల అర్జున్‌రావు, బీరెల్లి లాజర్, గోగుల సోములు, ఈర్ల వెంకటఅప్పారావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఆవుల మంగతాయి, కేలోత్ పాపారావు, ఆవుల వెంకటేశ్వర్లు, ఎస్‌కే లాల్‌మియా, వెంకటయ్య, ఉమా పాల్గొన్నారు.

పదేళ్లలో కాని పనులు...
పది నెలల్లో పూర్తి చేశాం

» బుగ్గవాగు ప్రాజెక్టు కాంట్రాక్టర్ పనులు చేయలేదు
» సంక్రాంతికి మంచుకొండ ఎత్తిపోతల పథకం శంకుస్థాపన
» ఆరు నెలల్లోపు నిర్మాణం పూర్తిచేసి రైతులకు సాగు నీరు అందిస్తా
» మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మంచుకొండలో శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో కాని పనులను.. కాంగ్రెస్ ప్రభుత్వం పదినెలల్లోనే పూర్తి చేశామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఆయన రఘునాథపాలెం మండలంలోపర్యటించారు. గతంలో తాను బుగ్గవాగు ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయిస్తే, కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదన్నారు. ఫలితంగా రఘునాథపాలెం మండలంలో రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాతి లోపుగా మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. శివాయిగూడెం, పువ్వాడ ఉదయనగర్, మంచుకొండలో సీసీ రహదారులు, డ్రెయినేజీలు, ప్రభుత్వ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. మంచుకొండలో మాజీ సర్పంచి వాంకుడోత్ విజయాదీప్లా నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పూలతో స్వాగతం పలికారు. మంచుకొండ ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం రూ.66కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ఆరు నెలల లోపుగానే పూర్తి చేసి రఘునాథపాలెం మండలంలో అన్ని గ్రామాల చెరువులకు నాగార్జున సాగర్ సాగునీరు రైతులకు అందిస్తామని మంత్రి తెలిపారు. మాజీ ఎంపీ రవీంద్రనాయక్, మాజీ ఏఎంసీ మానుకొండ రాధికిషోర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉండటంతో రైతులు వ్యవసాయ పండుగ చేసుకుంటున్నారని తెలిపారు.కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ శ్రీజ, డీఈ రాములు, ఏడీఈ సంజీవరావు, కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, తమ్మినివెంకటేశ్వర్లు, కొంటేముక్కల నాగేశ్వరరావు, భూక్య బాషానాయక్ పాల్గొన్నారు.

సాయితేజ కుటుంబానికి తుమ్మల పరామర్శ

ఖమ్మంసంక్షేమ విభాగం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని చికాగోలో ఇటీవల జరిగిన కాల్పుల్లో మరణించిన ఖమ్మం నగరానికి చెందిన నూకారపు సాయితేజ కుటుంబ సభ్యులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. సోమవారం సాయితేజ తల్లి,దండ్రుల నివాసానికి వెళ్లి తండ్రి కోటేశ్వరరావు, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన సహాయ కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, తోటకూరి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీటీవోగా వరప్రసాద్

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జ్ రవాణాశాఖ అధికారిగా వరప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు శాఖాపరంగా సోమవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం మోటారు వాహన ఇన్‌స్పెక్టర్‌గా గతంలో నాలుగేళ్ల పనిచేశారు. ప్రస్తుతం వైరా ఎంవీఐగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో డీటీవోగా పని చేసిన ఆఫ్రీన్‌సిద్దిఖీకి పదోన్నతిపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జీ డీటీవోగా వెంకటరమణకు బాధ్యతలు ఇచ్చారు. కాగా ఆయన పది రోజులు వ్యక్తిగత సెలవ్‌పై వెళ్లటంతో ఇన్‌చార్జీ డీటీవోగా వరప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు.

'ప్రధాన మంత్రి విశ్వకర్మ' రుణాలు మంజూరు చేయాలి

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంలో లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోద్‌రావు, పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఆయన జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణతో కలిసి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. బ్యాంకర్లతో మాట్లాడి వెంటనే రుణాలు మంజూరు అయ్యేలా చేయాలని కోరారు. లేకుంటే పేద ప్రజల తరఫున పోరాటం చేస్తామన్నారు.

పారామెడికల్ కోర్సు ప్రారంభం

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సోమవారం ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లో ప్రజాపాలన ప్రజావిజయ దినోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. మూడేళ్ల పాటు కష్టపడి చదువుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల్లో పారామెడికల్ హెల్త్, సైన్సు కోర్సులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు.

వారంలో ఫిర్యాదులు పరిష్కరించాలి

» కేఎంసీ కమిషనర్ అభిషేక్‌అగస్త్య
» ప్రజావాణిలో వినతులు స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

ఖమ్మంసంక్షేమవిభాగం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులకు వారం రోజులులోగా పరిష్కారం చూపాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆదేశించారు. కేఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆయన నేరుగా వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా గతంలో ప్రతీవారం 25నుంచి 30 వినతులు రాగా ఈ సోమవారం మాత్రం కేవలం 9మంది మాత్రమే వినతులు అందించారు.

పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారికి స్వాగతం



పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన కేవీ నారాయణకు సోమవారం జిల్లా పశువైద్యాధికారుల సంఘం నాయకులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎం. రమేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎం.ఉపేందర్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్ సంఘ బాధ్యులు డాక్టర్ అనంతు హరీష్, డాక్టర్ సంజయ్‌రెడ్డి మరియు సంఘ నాయకులు అశోక్, సుబ్బారావు, భువనేశ్ కుమార్, గంగాధర్, నాగులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోండి

» విద్యాకమిషన్‌కు పీడీఎస్‌యూ ప్రతినిధుల వినతిపత్రం

ఖమ్మంఖానాపురంహవేలి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఫీజుల బకాయిలు, ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు రాష్ట్ర విద్యాకమిషన్ ఆకునూరి మురళికి వన్నవించారు.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు,గురుకులాలు, కేజీబీవీల్లో మధ్యాహ్న భోజనం, పాఠశాలల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు సోమవారం జిల్లాకు వచ్చారు. ఈ నేపథ్యంలో మురళిని పీడీఎస్‌యూ ప్రతినిధి బృందం కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ క్రాంతి, జీ.మస్తాన్, భాను, శ్యామల, కళ్యాణ్ తదితరులు పాల్గోన్నారు. వసతిగృహ సంక్షేమ అధికారుల ఫోరం ఆధ్వర్యంలో మురళిని రఘునాథపాలెం మైనారిటీ గురుకులంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఫోరం నాయకులు కోటపాటి రుక్మారావు, నెల్లూరి నాగేశ్వరరావు, నాగమణి పాల్గొన్నారు.

గురుకులాలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

ఖమ్మంటౌన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వానికి గురుకుల పాఠశాలలపై చిత్తశుద్ధి లేదని గురుకులాల పోరుబాట జిల్లా ఇన్‌ఛార్జ్ కందుల మధు విమర్శించారు. సోమవారం సాయంత్రం జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని 18కి పైగా గురుకుల పాఠశాలలను సందర్శించామని, విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అపరిశుభ్ర వాతావరణంలో ఇరుకు గదుల్లో మగ్గుతున్నారన్నారు.

ఉద్యమ యువతకు ఉద్యోగాల్లో రిజర్వేషన్ కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూత్‌డే సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాల్లో 5శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ యువ జనసమితి జిల్లా కన్వీనర్ భట్టు రాజేందర్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతాచారి ఆత్మబలిదానం చేసుకున్నారని, వేలాదిమంది యువత స్వరాష్ట్ర సాధనకు పోరాడారని గుర్తు చేశారు.

14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని మండల లీగల్ సర్వీసెస్ చైర్మన్ ఎం.శ్రీనివాసరావు కోరారు. సోమవారం సత్తుపల్లి కోర్టు ఆవరణలో డివిజన్‌లోని పోలీస్ అధికారులతో కో-ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జీ మీరాఖాసీంసాహెబ్, జూనియర్ సివిల్ జడ్జీలు ఎస్‌కే.ఆయేషాషరీన్, వీ.లావణ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గోపాలరావు, ఏవో బోయినపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి

▸ సీపీఐ వైరా నియోజకవర్గ కార్యదర్శి యర్రా బాబు

వైరా, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో 2013 డిసెంబరు 11వతేదీ లోపు వ్యవసాయ రుణాలు తీసుకున్న ప్రతి రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రూ.రెండులక్షల రుణమాఫీ అమలు చేయాలని సీపీఐ వైరా నియోజకవర్గ కార్యదర్శి యర్రా బాబు డిమాండ్ చేశారు. సోమవారం వైరా సీపీఐ కార్యాలయంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రూ.రెండులక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందని ఆమేరకు విధిగా ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు యామాల గోపాలరావు, మిట్టపల్లి రాఘవరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి



ఎంపీవోకు వినతిపత్రం అదిస్తున్న నాయకులు

ఏన్కూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తూతక్కలలింగన్నపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీవాసులు 20రోజుల నుంచి తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీవో జీవీఎస్ నారాయణకు వినతిపత్రం అందించా రు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఏర్పుల రాములు మాట్లాడుతూ 20రోజుల నుంచి మిషన్ భగీరథ తాగునీరు రాక ప్రజలు అనేక ఇబ్బదులు పడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు రేపాకుల నరసరావు, రేపల్లే నర్సింహారావు, లక్ష్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

'పత్తి కొనుగోళ్లలో దళారుల దోపిడీని అరికట్టాలి'

ఏన్కూరు, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు వ్యవసాయమార్కెట్ పరిధిలో జరిగే పత్తి కొనుగోళ్లలో మధ్య దళారులు నిలువు దోపిడి చేస్తున్నారని గిరిజన సంఘాల ఐక్యవేదిక అనుబంధ రైతుసంఘం జిల్లా ఇన్‌చార్జి లకావత్ నాగేశ్వరరావు ఆరోపించారు. సోమవారం మార్కెట్ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందించాఉ. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని ఏన్కూరు, జూలూరుపాడు మండలాల్లో పెసా చట్టం పకడ్బందీగా అమలు కావడం లేదని వాపోయారు నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరులు అనుమతులు పొంది సిండికేట్‌గా ఏర్పడి అమాయక గిరిజన రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. ఏన్కూరు కేంద్రంగా సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం నాయకులు కుమార్, శ్రీను, మంగ్యా, శివ పాల్గొన్నారు.

డబుల్.. ట్రబుల్

▸ నాసిరకంగా డబుల్ ఇళ్లు
▸ పెచ్చులూడుతున్న వైనం
▸ కూలిపోతున్న గోడలు
▸ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలని వినతి



రావినూతలలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

బోనకల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల, చొప్పకట్లపాలెం, చిరునోముల, రాయనపేట, రాపల్లి గ్రామాలలో గత నాలుగేళ్ల క్రితం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ ఇళ్లను నిర్మించింది. ఒక్కొక్క గ్రామానికి 20 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి మొత్తం 100 మందికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను పంపిణీ చేసింది. గూడు లేని తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టించి ఇస్తున్నారని లబ్ధిదారులు అప్పట్లో ఎంతగానో సంతోషించారు. కాని ఇళ్లల్లోకి వెళ్లిన కొన్ని రోజుల తరువాత ఇంటి నిర్మాణాల్లో వచ్చిన మార్పులు చూసి లబోదిబోమన్నారు. కాగా డబుల్ బెడ్‌రూం ఇళ్లు పేకమేడలా మారుతున్నాయని, ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియడం లేదని ప్రజలు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు.

నాడు డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ప్రజలకు పంపిణీ చేసేందుకు గ్రామానికి మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. తక్కువ ఖర్చుతో పనులను పూర్తి చేసే లక్ష్యంలో భాగంగా పనులన్నీ నాసిరకంగా చేపట్టారు. దీంతో ప్రస్తుతం పునాదులతో పాటు గోడలు, స్లాబ్, మెట్ల గోడలు, ఫ్లోరింగ్ దెబ్బతిన్నాయి. వర్షం వస్తే స్లాబ్ నుంచి నీళ్ల దారలు ఇంటిలోకి పడుతుండటంతో సామన్లను మార్చుకోవడంతో పాటు అందులో ఉండే వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షించే అధికారులు కూడా ప్రేక్షక పాత్ర పోషించడంతో డబుల్ ఇళ్లు ప్రజలకు డబుల్ పరేషాన్‌ను కలిగిస్తున్నాయి.

కూటికి లేని వాళ్లం కాసులు తెచ్చి ఇంటి పనులు ఏం చేయించుకోంటామని, తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్లాబ్‌పై పెచ్చులు ఊడి మీద పడుతున్నాయని, గోడలకు పగుళ్లు, ఫ్లోరింగ్ దెబ్బతిన్నాయని వాపోతున్నారు. చొప్పకట్లపాలెం గ్రామంలో కొందరూ మరమ్మతులు చేయించుకొని ఉంటున్నారు. కొన్ని గ్రామాల్లో ఇళ్లల్లో ఉండలేక వేరేచోట ఉండటంతో తాళాలే ఇళ్లకు దర్శనమిస్తున్నాయి. రావినూతల డబుల్ బెడ్‌రూం ఇళ్లు దిగువ ప్రాంతంలో ఉండటంతో చెరువు నిండినా, వర్షపు వరద నీరు ఎక్కువగా వచ్చినా ఇళ్లల్లోకి నీళ్లు చేరుతున్నాయి. ఇక్కడ నిర్మించిన ఇళ్లకు రెండు వైపులా సైడ్ డ్రైన్లు, రోడ్డు సౌకర్యం కల్పించాలని, బాగా దెబ్బతిన్న ఇళ్లను గుర్తించి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్లాబ్‌పై పెచ్చులు ఊడి మీద పడ్డాయి

● చితిరాల సుహాసిని, రావినూతల



వంట గదిలో వంట చేస్తుండగా స్లాబ్ పెచ్చులు ఊడి మీద పడ్డాయి. భయం వేసి బయటకు పరుగు తీశాను. వర్షం వస్తే ఇళ్లంతా కురుస్తుంది. ఎప్పుడు, ఏం జరుగుతుందో తెలియడం లేదు. రోడ్డు, డ్రైన్లు లేవు. అప్పట్లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారని ఎంతగానో ఆనందించాం. కాని ఇందులోకి వచ్చాక ఎప్పుడు కూలిపోతాయో, తమకు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయంగా కాలం గడుపుతున్నాం.

కొణిజేటి రోశయ్య వర్ధంతికి తరలిరండి

కొణిజర్ల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఈనెల 4న నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతికి మండలం నుంచి ఆర్యవైశ్యులంతా భారీ సంఖ్యలో తరలిరావాలని ఆర్యవైశ్య సంఘం నాయకులు కోరారు. వర్ధంతి కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నారని, ఆర్య వైశ్యులంతా సకాలంలో రావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొణతం ఉమాశంకర్, ప్రవీణ్, మిట్టపల్లి శ్రీనివాస్, అనుమోలు కృష్ణ ప్రసాద్, పసుమర్తి శంకర్, జవ్వాజి నాగేశ్వర రావు సోమవారం తెలిపారు.

లింగగూడెం మాజీ సర్పంచ్ జోగయ్య మృతి



పెనుబల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బద్దం జోగయ్య(70) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతిచెందారు. జోగయ్య 1988 మార్చిలో తెలుగుదేశం పార్టీ బలపర్చగా ఎన్నికల్లో గెలిచి తొలిసారిగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అనంతరం మూడుసార్లు ఏకగ్రీవం, మరోసారి ఎన్నికల్లో పోటీ చేసి సర్పంచ్‌గా గెలిచారు. ఈయన సర్పంచ్‌గా ఉన్నకాలంలోనే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లింగగూడెం గ్రామంలో జన్మభూమి గ్రామ సభ నిర్వహించి అనేక హామీలు ఇవ్వగా ఆహామీలు నెరవేరడంతో గ్రామం అభివృద్ధి పథంవైపు నడిచింది. జోగయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

5న బుగ్గపాడులో ప్రజా విజయోత్సవ ర్యాలీ

▸ ఎమ్మెల్యే మట్టా రాగమయి



గంగారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రజల సంపూర్ణ మద్దతుతో ప్రజాపాలన చేపట్టి ఏడాది పూరైనా సందర్భంగా ఈనెల 5న బుగ్గపాడులో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. ఆదివారం సత్తుపల్లి, వేంసూరు మండలాలో పంచాయితీరాజ్ శాఖ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పలు అభివృద్ధి పథకాలకు ప్రారంబోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుగ్గపాడు మెగా ఫుడ్‌పార్క్ వద్ద జరిగే విజయోత్సవ సంబురాలకు రాష్ట్రమంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు హాజరవుతారని ఆమె తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు ఇప్పటి నుంచైనా పంథా మార్చుకోవాలని, ఇక ముందు పునరావృతమైతే సహించమని, మా కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈఈ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో కనకదుర్గ, ఐకేపీ ఏపీఎం కేవీ. సుబ్బారావు, ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈ సాయికృష్ణ, కావ్య, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, భూపతిరెడ్డి, చిట్టినాయన, నరసింహారావు, శివా వేణు, కోలగట్ల చెన్నారావు, కావేటి అప్పారావు, కర్నాటి వెంకట్రావు, బండారు మారేష్, బత్తుల నారాయణ, జల్లిపల్లి వాసు, కోటమర్తి జవహర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వేంసూరు, మర్లపాడు, వెంకటాపురం, లింగపాలెం గ్రామాల్లో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం

▸ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



కారేపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కారేపల్లి, డిసెంబరు2(అంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చి న హామీలన్నీ నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. సోమవారం కారేపల్లి మండలంలో రూ.9కోట్లతో ఏర్పాటు చేయనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంబోత్సవాలు చేశారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. రూ.రెండు లక్షల రుణమాఫీని పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రకటనలు మానుకోవాలని సూచించారు.

ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వైరా నియోజకవర్గం ఇన్‌చార్జి, జిల్లా మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రాష్ట్ర మహిళ నాయకురాలు పగడాల మంజుల, రాంమూర్తి, సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని గేటుకారేపల్లి గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 30కుటుంబాల నాయకులు ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పార్టీ జండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనేక మందికి సీఎంఆర్ చెక్కులు పంపిణీ చేశారు.

'క్రీడలు ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తాయి'

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : క్రీడల విద్యార్థులలో ఆత్మగౌరవాన్ని, సామాజిక నైపుణ్యాలను, విశ్వాసాన్ని మెరుగుపరచడంలో సహాయ పడుతాయని ఎన్టీఆర్‌నగర్ ఎంపీపీస్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ అన్నారు. ప్రజాపాలన విజయోత్సవ సంబురాల సందర్భంగా సోమవారం విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, లాల్‌అహ్మద్, శేషుకుమార్, నర్సింహారావు, విజయ, వెంకటేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ కమిటీ ఎన్నిక

కల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మోదుగు రాంబాబు, సెక్రటరీగా రాయల నాగేశ్వరరావు, ట్రెజరర్‌గా బంకా వెంకట్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా ఫొటో అండ్ వీడియో గ్రావర్ల సంఘం అధ్యక్షుడు వేములూరి నాగరాజు దేవర పాల్గొని మాట్లాడారు. ఈ కార్యకమంలో ఆర్కే బాబామ్, మల్రేల నాగేశ్వరరావు, సంపత్, వెంకట్, చల్లా వెంకటేశ్వరరావు, వేపూరి తిరుమలరావు, హమీబ్, బీవీ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాభవన్' ముట్టడికి జీఎంపీఎస్ పిలుపు

పెనుబల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రూ.రెండులక్షల నగదు బదిలీ ద్వారా రెండోవిడత గొర్రెల పంపిణీ చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చి మోసం చేసిందని, అందుకు నిరసనగా ఈనెల 9న ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని గొర్రెలు, మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మామిళ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరుపతిరావు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాగభూషణం, రాములు, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, వెంకట్రాములు, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పశువైద్యాధికారిని కలిసిన గోపాలమిత్రలు

వైరా, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఖమ్మంజిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిగా నియమితులైన డాక్టర్ కె.వెంకటనారాయణను గోపాలమిత్రలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఖమ్మంజిల్లా గోపాలమిత్రల అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటనారాయణను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు వెంకటేశ్వర్లు, డి.శేషగిరి రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు కృష్ణయ్య, సభ్యులు ఈ.ప్రభాకర్, జేకే.ప్రసాద్, షేక్.సుబానీ పాల్గొన్నారు.

'రెండు రకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలి'

వైరా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతి కేంద్రంలో సన్న, దొడ్డురకాల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, బ్యాంకులో రుణం ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం వైరా రెవెన్యూ కార్యాలయం వద్ద, పూసలపాడు సొసైటీ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ఆయా కార్యాలయాల అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, బాణాల శ్రీనివాసరావు, చింతనిప్పు చలపతి రావు, పారుపల్లి కృష్ణారావు, తోట నాగేశ్వరరావు, మేడా శరాబందీ, సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, వనమా చిన్నసత్యనారాయణ, కొంగర సుధాకర్, మధు, జానిమియా, మజీద్, రెహన పాల్గొన్నారు.

పెనుబల్లిలో ఈజీఎస్ ఓపెన్ ఫోరం

పెనుబల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీలో భాగంగా సోమవారం ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. డీఆర్‌డీవో అడిషనల్ పీడీ శిరీష ఆధ్వర్యంలో మండలంలోని 33గ్రామపంచాయతీలకు 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు జరిగిన సుమారు రూ.4కోట్ల పనులు నిర్వహించారు. సోమవారం రాత్రికి 16గ్రామపంచాయతీల్లో నివేదికలను పూర్తి చేశారు. వీటిలో పలువురికి రూ.66,792 జరిమానా విధించి రూ.42వేలను రికవరీ చేసినట్లు తెలిపారు. నర్సరీల నుంచి రూ.22వేలు, ఈజీఎస్ నుంచి రూ.19వేలు రికవరీ చేసినట్లు శిరీష వివరించారు. ఇంకా ఓపెన్ ఫోరం కొనసాగుతూనే ఉంది. కార్యక్రమంలో ఎంపీడీవో అన్నపూర్ణ, అంబుడ్స్‌మెన్ సురేష్, ఎస్ఆర్‌పీ సాంబశివచారి, యాదాద్రి, ఏపీఎం పవన్, డీఈవో సక్రియ, ఏపీవో విజయబాబు, రంగనాయకమ్మ, ఫీల్డ్, టెక్నీకల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామసభల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

▸ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు

ముదిగొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాల అమలుకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హత కలిగిన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ముదిగొండ మచ్చా వీరయ్య భవనంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 7వ తేదీన 8వ సీపీఎం మధిర డివిజన్ మహాసభ మధిర మండలం మల్లారం గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు బండి రమేష్, వాసిరెడ్డి వరప్రసాద్, బండి పద్మ, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు మంకెన దామోదర్, కోలేటి ఉపేందర్, కల్యాణ్, భద్రయ్య, నాగేశ్వరరావు, పద్మ, అరుణ పాల్గొన్నారు.

ఇసుక రీచ్ ప్రారంభం

మధిర రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలుకూరు గ్రామంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐకేపీ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఇసుక ర్యాంపును తహసీల్దార్ రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకొనేందుకు ఇసుక అవసరమైన వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ ర్యాంపు నుంచి ఇసుకను తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ బెజ్జం కిలక్ష్మీభార్గవి, ఎంపీవో శాస్త్రీ, ఐకేపీ ఏపీఎం రాంబాబు, ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎర్రుపాలెం, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాల, కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిన బోధించడానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.సరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25కిగాను పాఠశాలలో ఇంగ్లీష్, గణితం, బయోసైన్సు, కళాశాలలో కెమిస్ట్రి సబ్జెక్టులను ఆంగ్ల మాధ్యమంలో కాంట్రాక్టు పద్ధతిలో బోధించడానికి డిసెంబరు 4వతేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పెనుబల్లి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పెనుబల్లిలో కేజీబీవీ కళాశాలలో ఇంగ్లీష్ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేక అధికారి వెంకటరమణ తెలిపారు. ఈ పోస్టుకు ఎంఏ ఇంగ్లీష్, బీఈడీ చదివిన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 3,4తేదీల్లో దరఖాస్తులను కేజీబీవీ(ఉప్పలచిలక)లో అందజేయాలని, మెరిట్ ఆధారంగా ఎంపిక చేయటం జరుగుతుందని తెలిపారు.

తోపుడు బండ్లు వితరణ

వైరా, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రణీతి లక్ష్మి, రాయి రవళి అనే మహిళలకు వీధి వ్యాపారాల నిమిత్తం తోపుడుబండ్లను డాక్టర్ కాపా మురళీకృష్ణ చేతులమీదుగా అందజేశారు. లయన్స్‌క్లబ్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు, చింతలపూడి వెంకటేశ్వరరావు, లగడపాటి ప్రభాకర్‌రావు, చింతోజు నాగేశ్వరరావు, అబ్బూరి రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

9న కాకతీయ క్రషింగ్ ముగింపు

కల్లూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని శ్రీకాకతీయ షుగర్స్ ఫ్యాక్టరీ పరిధిలో 2024-25 క్రషింగ్ సీజన్ గడువు ఈ నెల 9 వ తేదీతో ముగించనున్నట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ చల్లగుండ్ల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆకట్టుకున్న ప్రజాపాలన సాంస్కృతిక ప్రదర్శనలు



మాట్లాడుతున్న హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ

మధిరటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా సోమవారం మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి నాగరాజు నేతృత్వంలో కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు పలువురిని ఆకట్టుకున్నాయి. దాదాపు 60 మంది కళాకారులు ఏడాది ప్రభుత్వ విజయాలు, కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రమాణ స్వీకా రం చేసిన వారం రోజుల్లోనే ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. భట్టి లాంటి నాయకుడు దొరకడం మధిర ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, డీపీఆర్వో గౌస్, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, రంగా హనుమంతరావు, సూరంశెట్టి కిషోర్, దుంపా వెంకటేశ్వరరెడ్డి, బాలరాజు, రవి కుమార్, కళాకారులు పుతుంబాక కృష్ణప్రసాద్, మునుగోటి వెంకటేశ్వరరావు, సుబ్బరాజు తదితరులున్నారు.

'రైతులు ఆర్థికాభివృద్ధిని సాధించాలి'



మల్లు నందినిని సన్మానిస్తున్న విద్యాలత

మధిర రూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని దేవుడిని ప్రార్థించానని అమ్మ ఫౌండేషన్ చైర్మన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో రాజరాజనరేంద్రస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన మల్లు నందిని మధిర మునిసిపల్ వైస్‌చైర్‌పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భరత్ విద్యాసంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, చెరుకూరి నాగార్జున్, చింతల గోపి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్తుపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉంటాం

▸ బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ రామలింగేశ్వరరావు



కిషన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆపార్టీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తాండ్ర వినోదరావులు చొరవ తీసుకుని కేంద్రంమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి కేంద్రం రూ.20కోట్ల నిధులను మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా సోమవారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు నాయుడు రాఘవరావు, సుదర్శన్‌మిశ్రా, నాయకులు పాలకొల్లు శ్రీనివాస్, ఆచంట నాగస్వామి, మట్టా ప్రసాద్, ఎస్‌కే.రహ్మతుల్లా, సుభానీ, శ్రీనివాస్, మాదిరాజు శ్రీనివాస్, నరసింహమూర్తి తదితరులున్నారు.

గ్రామాల్లో కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే ప్రారంభం

తల్లాడ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో 15రోజులపాటు వివిధ గ్రామాల్లో నిర్వహించనున్న కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే కార్యక్రమాన్ని వైద్యాధికారి ఐ.రత్నమనోహర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ఎవరికైనా అనుమానాస్పద మచ్చలు పరిశీలించటం జరుగుతుందన్నారు. సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి డాక్టర్ నిష్మా, డీపీఎంవో శాస్త్రీ, సూపర్‌వైజర్లు భాస్కర్, పెద్దపుల్లయ్య, యూనిస్ లక్ష్మీ, భద్రమ్మ పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కల్లూరు ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన వాసంతి

కల్లూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జలవనరులశాఖ కల్లూరు సర్కిల్ కార్యాలయానికి ఎస్ఈ గా వాసంతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో గల ఈఈ లక్ష్మీనారాయణ, డీఈలు రత్నాకర్, వెంకటేశ్వరరావు, సిబ్బంది నూతనం గా బాధ్యతలు చేపట్టిన ఆమెకు బొకే అం దించి శుభాకాంక్షలు తెలిపారు. బాన్సువాడ జలవరులశాఖ సర్కిల్ నుంచి కల్లూరుకు బదిలీపై ఎస్ఈగా వాసంతి వచ్చిన విషయం విధితమే.

ఆర్థిక సాయం అందజేత

తల్లాడ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందిన ప్రైవేట్ లెక్చరర్ యోబు కుటుంబానికి శ్రీసూర్య కళాశాల నిర్వాహకులు లగడపాటి నెహ్రూ ఆధ్వర్యంలో పలువురు ప్రైవేట్ లెక్చరర్లు, పూర్వ విద్యార్థులు చేయూతనందించారు. సోమవారం యోబు భార్య మరియా, ఇద్దరు కుమార్తెల పేరున స్థానిక యూనియన్ బ్యాంకులో రూ.1.80లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను మేనేజర్ రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో లగడపాటి నెహ్రూ, మాధవి, సాంబశివరావు, పుల్లారావు, లక్ష్మీప్రసన్న, కటికి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శివాలయాల్లో పూజలు

తల్లాడ, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లి, తల్లాడ శివాలయాల్లో సోమవారం ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన, అన్నాభిషేకం, రుద్రహోమాలు నిర్వహించారు. మిట్టపల్లిలో అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో అర్చకులు కంచల సతీష్‌శర్మ, పి.మణికంఠశర్మ, నిర్వాహకులు పసుమర్తి అనంత రామయ్య, శ్రీనివాసరావు, మిట్టపల్లి నర్సింహారావు, చిత్తలూరి నర్సింహారావు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల కోర్డినేషన్ పరిశీలన

కల్లూరు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని పలు మంచినీటి పథకాల ద్వారా నీట సరఫరా నాణ్యతపై సోమవారం మండల స్థాయి అధికారులు సందర్శించి పరిశీలించారు. మండల పరిషత్ పంచాయతీ అధికారి సురేష్‌బాబు, పంచాయతీ ఈవో మద్దిశెట్టి నాగేశ్వరరావులు మంచినీటి పథకాల వద్ద వాటిని పరిశీలించారు. మంచినీటి పథకాల వద్ద సిబ్బంది కోర్డినేషన్ చేసే విధానాన్ని, గేట్‌వాల్స్ మరమ్మతులు, ట్యాంకులు శుభ్రతను తనిఖీ చేశారు.